తానొకటి తలిస్తే....!

[కథ]

= శ్రీ అందే నారాయణస్వామి =

వడకకుర్చీలో పండుకుని పత్రిక చదువుకుంటూ వున్న జగన్నాథం ఏదో అతిముఖ్యవిషయం గుర్తుకువచ్చినట్టు తటాలున పత్రిక మడిచి లేచికూర్చుని భార్యను పిలిచి "పన్నెండు కావస్తున్నది, ఇవ్వాళ అమ్మడు యింకా బడి నుంచి రాలేదు యెందువల్లనో" అన్నాడు.

"నేనూ అదే అనుకుంటున్నానండీ. రోజూ యింతకు ముందే యింటికివచ్చే బిడ్డ యివ్వాళ ఎందుచేతనో యింత వరకూ రాలేదు" అన్నది మహాలక్ష్మమ్మ.

"రాముణ్ణి యిట్లా పిలు, బడికి పంపుదాం"

"యిందాకా వాణ్ణి తోటకు పంపితిరిగదూ"

"యెవ్వరూ వున్నట్టు లేదు. సరే! నేనే వెళ్లివస్తాను"

జగన్నాథం ఇంట్లోకి వెళ్లి, చొక్కా వుత్తరియ్యం వేసుకుని బయలుదేరబోతూవుండగా, అరవింద నలుగురు జతకత్తెలను వెంటవేసుకుని వచ్చింది. వయస్సు పదకొండు సంవత్సరాలు. పచ్చని శరీరచ్ఛాయ, అరవిందాలవంటి పెద్ద కళ్లు, అందమైన ముఖం.

కుమార్తె రాగానే జగన్నాధం ఆనందంతో ఆమెను దగ్గిరికి తీసుకుని తల నిమురుతూ "అమ్మడూ! యివ్వాళ యింత ఆలస్య మయిందేం? స్కూలు విడిచిపెట్టగానే యింటికి రావూ! యింతసేపటిదాకా ఎక్కడున్నావమ్మా? నీకోసమే బయలుదేరుతున్నాను" అన్నాడు.

"విమలగారింట్లో వున్నాను నాన్నా! మేము బొమ్మల పెళ్లిళ్లు చేసుకుంటున్నాం. యిప్పుడు మేము ఆడపెండ్లివారింటికి తరలిపోవాలి నాన్నా!" అన్నది ముద్దులొలికే మాటలతో అరవింద.

"ఇంకేం! ఆటలాడుతూ కూర్చున్నది. ఇంటికి వచ్చి అన్నం తినిపోకూడదూ తల్లీ!" అన్నది మహాలక్ష్మమ్మ.

"వాళ్లింటి కెందుకమ్మా వెళ్లడం? మన యింట్లోనే ఆడుకోకూడదూ. కావలసినంత విశాలం వున్నది" అన్నాడు జగన్నాథం.

"అదేమిటి నాన్నా! వాళ్ల ఆడపిల్లను మనింటికి పంపుతారా?" అన్నది అరవింద.

ఆ ముద్దుమాటలకూ యీడుకు మించిన ఆ లోకపరిజ్ఞానానికీ తల్లిదండ్రుల హృదయాలు ఆనందంతో పొంగిపోయినవి. బిడ్డభావిజీవితంగూడా యిటువంటి శుభసంఘటనలతో నిండుగాక అని వారి ప్రేమహృదయాలు లోలోన దీవెనలిచ్చినవి.

"ఓహో! అట్లాగటమ్మా! నాకింకా తెలియదు! మగపెండ్లివారేం మీరు? మామనవణ్ణి నా కెప్పుడూ చూపించలేదేం తల్లీ?" అన్నాడు జగన్నాథం.

"నీదంతా యెగతాళి నాన్నా!" అంటూ తండ్రిచేతుల్లోనించి విడిపించుకుని పలకాపుస్తకాలతో యింట్లోకి పరుగుపెట్టింది అరవింద. కుమార్తె వెంట యింట్లోకి వెళ్లారు దంపతులు.

"భోజనానికి కూర్చుందాం రా అమ్మడూ!" అన్నది మహాలక్ష్మమ్మ. "వాళ్లు వెళ్లిపోతారేమోనే అమ్మా! వుండమని చెప్పివస్తాను" అన్నది అరవింద.

"యింకా ఆకలి కావటంలేదటమ్మా? నువ్వు బట్టలూ అవీ విడువు. వుండమని నేను వాళ్లతో చెప్పివస్తానులే" అని జగన్నాధం హాల్లోకి వచ్చి ఆపిల్లలతో వుండమని చెప్పి యింట్లోకి వెళ్లిపొయ్యాడు.

తల్లితండ్రుల సరసన భోజనానికి కూర్చున్న అరవింద త్వరత్వరగా భోజనం ముగించి వాళ్లకంటే ముందుగా లేచి చెయ్యి కడుక్కొని జతకత్తెలను కలుసుకుని డాబాపైకి వెళ్లిపోయింది. జగన్నాధం, మహాలక్ష్మమ్మ భోజనాలవద్ద నుండి లేచి హాల్లో కూర్చుని తాంబూలం వేసుకుంటూవుం

డగా రాముడు తోటనుంచి గంపనిండా బత్తాయినారింజపండ్లు తీసుకవచ్చి వారికి వప్పగించి తన పనిమీద తాను వెళ్లిపొయ్యాడు. "అమ్మణ్ణి పిలు. ముందుగా తన యిష్టంవచ్చిన కాయలు తీసుకుంటుంది. ఏరిపారవేసిన కాయలు నాకు వద్దని తర్వాత పేచీపెడుతుంది" అన్నాడు జగన్నాధం భార్యతో. ఆమె వెళ్లి అరవిందను పిలుచుకవచ్చింది. "నీయిష్టంవచ్చిన కాయలు యేరుకో అమ్మడూ!" అన్నాడు జగన్నాధం. "చాలా మంచిపండ్లు నాన్నా! మన తోటలోవేనా యివి? మాపసుపు కుంకాల్లోకికూడా పనికివస్తవి నాన్నా" అంటూ యెంతో ఆనందంతో అరవింద కొన్నిపండ్లు యేరుకొని అందులోవి నాలుగుపండ్లు తన జతకత్తెలకు నలుగురికీ ఇచ్చింది. అమ్మడి ఔదార్యం చూడమన్నట్టు భార్యాభర్తలు ఒకరి ముఖంకేసి ఒకరు చూసుకుని మురిసిపొయ్యారు. అరవిందా, జతకత్తెలూ పండ్లూ, పసుపూ పళ్లాల్లో పెట్టుకుని వెళ్లిపోతూవుండగా "త్వరగా రా అమ్మడూ!" అని చెప్పాడు జగన్నాధం.

రాత్రి భోజనానంతరం జగన్నాధం పడకకుర్చీలో కూర్చున్నాడు. ప్రక్కగా చాపమీద మహాలక్ష్మమ్మ కూర్చున్నది. తల్లికి దగ్గరగా అరవింద కూర్చుని మొల్లరామాయణం చదువుతున్నది. జగన్నాధం అర్థం చెపుతున్నాడు. వీధినే ఎవరిదో వూరేగింపు వెళ్లుతూవుండడంవల్ల చదవటం ఆపి అరవిందా, మహాలక్ష్మమ్మా పెండ్లివారిని చూడ్డానికి వీధిలోకి వెళ్లారు. జగన్నాధం కూర్చున్నవాడల్లా లేచి కిటికీలోగుండా ఆ వూరేగింపును చూస్తున్నాడు. పెండ్లివారు ధనవంతులు కామాలు. పూలపల్లకీ, లెఖ్ఖలేనన్ని గ్యాసులయిట్లు, బాణసంచా, రకరకాల వాయిద్యాలతో జంయ్యిమంటూవున్నది ఆ వూరేగింపు. అమ్మడి పెండ్లి యింతకంటే వైభవంగా చెయ్యాలనుకున్నాడు మనసులో జగన్నాధం. వూరేగింపు సాగిపోవడంవల్ల మహాలక్ష్మమ్మా, అరవిందా లోనికి వచ్చారు. "అమ్మడి పెండ్లి యిట్లా యెప్పుడు చూసుకుంటానో!" అన్నది మహాలక్ష్మమ్మ భర్తకేసి చూస్తూ.

"అదీ యెంతోదూరంలో లేదు. అమ్మడికి యిప్పుడు పదకొండో సంవత్సరం అనుకో. ఈశ్వరకృప చక్కగా వుంటే యింకా రెండేళ్లకు"

"త్వరగా చెయ్యండి. యెప్పటి మే లప్పుడే. ఒక్కగాను ఒక్కబిడ్డ. పెండ్లి యెంత బాగా చెయ్యాలనుకున్నారు? అట్లా పూలపల్లకీ, మంచిమంచి మేళాలూ తెప్పించాలిసుమా?"

"అమ్మడికి కాకపోతే మనం యింకెవరికి ఖర్చుపెట్టబోతాము? ఇంకెవరి వేడుక చూసుకోబోతాము గనక. యిక మన జీవితంలో ఆమెవివాహంకంటే చెయ్యబొయ్యే కార్యాలేమున్నవి? కట్నాలూ అవీ కాకుండా అమ్మడి పెండ్లికి పదివేల రూపాయలు ఖర్చుచెయ్యాలని అంచనా వేసుకున్నాను. సరేనా?"

ఆమాటకు మహాలక్ష్మమ్మముఖం వికసించింది. అరవింద వాళ్ళ మాటలు ఆలకించనట్టు పుస్తకంలో పేజీలు తిరగవేస్తూవున్నది.

"చూడండి; అప్పుడు పట్టుపట్టుమంటే మంచి సమ్మంధాలు యెక్కడ దొరుకుతవి? యిప్పట్నించే దేవులాడుకుని యేదో మంచిసమ్మంధం మాట్లాడుకుని వుంచుకుంటే మంచిది"

"మంచిసమ్మంధం దొరకదని నీకేమీ సందేహం వద్దు. మనకేమీ ధనవంతుడైన వరుడు కావాలని లేదుగదా? అమ్మడికి కావలసినంత ఆస్తి వుందె! అత్తవారు బీదవాళ్లయినా ఫరవాలేదు."

"అయితేమాత్రం యింకేమీ మంచిచెడ్డలు వద్దుటండీ?"

"కుర్రవాడు బాగా చదువుకున్నవాణ్ణిగా చూద్దాం. అంతేగా?"

"చదువు వొక్కటుంటే చాలుటండీ? కుర్రవాడు రూపవంతుడూ, గుణవంతుడైవుండాలి. సంప్రదాయం మంచిదికావాలి. చాలామంది బంధువులుగలవాడై వుండాలి"

"నువ్వు చెప్పిన లక్షణాలన్నీ గల వరుడు ధనవంతుడైవుండి దొరకటం దుర్లభంగాని పేదవాళ్లలో కావలసినంత మంది దొరుకుతారు"

"అట్లని అశ్రద్ధచేస్తే తీరా మంచిసమ్మంధాలన్నీ అయిపొయ్యాక కక్కూర్తి పడవలసివస్తుంది. చూడండి : బిడ్డకు తగిన వరుణ్ణి తేలేకపోతే మనం ఎంత ఆస్తి యిచ్చినా ప్రయోజనం వుండదు. ఆడబిడ్డమీద తల్లిదండ్రులకు ఎంత అనురాగంవున్నా ఆ అనురాగాన్నంతా ఆమెకు తగిన వరుణ్ణి తెచ్చేటందుకే వినియోగించాలి కాదుటండీ? ఆమెజీవితానికి వన్నెపెట్టేవాడు భర్త."

"నిజమే. వాళ్లిద్దరూ అనుకూలదాంపత్యంతో చక్కగా వుంటే మనం చూసి సంతోషించవలసినవాళ్లమే. చూడు. ఇక మన జీవితంలో అమ్మడి శ్రేయస్సుకంటే కోరదగ్గ కోరికలేమున్నవి? ఆమెకు వరుణ్ణి తేవడంలో అశ్రద్ధ యెన్నటికీ జరగదు. అన్నివిధాలా తగిన వరుణ్ణి తెద్దాం. అమ్మడికేం రాజా! ఆమెకు యెందులోనూ యేలోటూ జరగదు. ఆమె విషయంలో నీ కేలాటి సందేహం వద్దు"

"మీకు తెలియదటలేండి. నేను వూరికే అంటున్నా గాని" అని సంబాళించుకున్నది మహాలక్ష్మమ్మ.

అరవింద ఆవలిస్తూవుండడం చూసి జగన్నాధం "అమ్మడూ! నిద్ర వస్తున్నదా? పొద్దుపోయింది. ఇక పోయి పండుకో" అన్నాడు.

౨

జగన్నాధం ధనవంతుడు. స్థిరచరాస్తులు మొత్తం రెండు లక్షలకు వుంటవి. వయస్సు దాదాపు యాభైయేళ్లుంటవి. కాయపారుమనిషి. వారికి అరవింద ఒక్కతే సంతానం. అరవింద వారికి అమరవింద. అరవిందకు పన్నెండవ యేడు రాగానే తల్లిదండ్రులు ప్రయత్నం చెయ్యకుండానే చీమలు బారుపెట్టినట్టుగా ఎన్నో సమ్మంధాలు రా మొదలు పెట్టినవి. పిల్లా చక్కని చుక్క! అంతకంటే విశేషమయింది ధనం వకటి. ఇంకేం! కామినితోపాటు కాంచనంగూడా లభిస్తూవున్నప్పుడు సమ్మంధాల కేం కొదవ? వచ్చిన సమ్మంధాల్లో కుర్రవాడికి చదువు వుంటే రూపం లేక, రూపం వుంటే చదువులేక, ఆ రెండూ వుంటే సంప్రదాయం నచ్చక యెన్నో సంబంధాలు తిరుగుముఖం పట్టినవి. ఆఖరుకు ఏలూరులో ఒక సమ్మంధం కుదిరింది. వరుడు యం. ఎ. వరకు చదువుకున్నాడు. స్ఫురద్రూపి. అది వాళ్లకు అన్నివిధాలా నచ్చిన సమ్మంధం. అతని పేరు జనార్దనస్వామి. ఎన్నో తరాలనుండి వాళ్ల కుటుంబీకులు పేదవాళ్లు. యీసమ్మంధం ఖాయపడగానే జనార్ధనస్వామీ, అతని తల్లిదండ్రులూ ఆవేళ పడ్డ ఆనందానికి అంతులేదు.

అయితే సమ్మంధం ఖాయంచేసుకునే ముందు జనార్ద నస్వామితండ్రి వెంకటనారాయణ జగన్నాథాన్ని ఒక విషయం అడిగాడు. "మీకు వుత్తరోత్తరా యెవరినయినా తెచ్చుకుని దత్తతచేసుకోవాలని వున్నదా?" అని.

అందుకు జగన్నాధం "ఆలాటి వుద్దేశం మాకు లేదు బావగారూ. మా అనంతరం మాకున్న యావదాస్తీ మా అమ్మడికే చెందుతుంది" అని సమాధానం చెప్పాడు.

అరవిందకు పదమూడవ యేడు రాగానే అరవిందకూ, జనార్దనస్వామికీ వైభవంగా వివాహం జరిగిపోయింది. జగన్నాధానికీ మహాలక్ష్మమ్మకూ అల్లుణ్ని తెచ్చుకుని తమయింట్లోనేవుంచుకోవాలని సంకల్పం. అల్లుణ్ణి వొక్కణ్ణే వుంచమని అడిగేటందుకు ఆతడు తల్లిదండ్రులకు వొక్కడే కొడుకు. అతనివల్లనే వాళ్లు జీవనంచేస్తున్నారు. ఆవక్కణ్ణి పంపమని యెట్లా అడుగుతారు? అందువల్ల వివాహం అయిన నెలలోనే జగన్నాధం ఏలూరు వెళ్లి "ఇక మీరంతా వచ్చి మా యింట్లోనే వుండవలసినది బావగారూ! నేనూ పెద్దవాణ్ణయిపోతున్నాను. జనార్దనస్వామే నాకు చేదోడువాదోడుగా వుండి యింటి వ్యవహారాలన్నీ జరుపుకుపోతా"డని వియ్యంకుడితో అన్నాడు.

అందుకు వియ్యంకు డిట్లా అన్నాడు: "మేమంతా వచ్చి మీయింట్లోనే వుండనవసరంలేదు బావగారూ. మేమెక్కడ వున్నా మీవాళ్లమే! మాదంపతులం పెద్దవాళ్లమయిపొయ్యాము. ఇక మేము బ్రతికే కొద్దికాలంగూడా యిక్కడే గడపదలచాము. మీమాట తోసివేశామని అనుకోవద్దు. తీరికయినప్పుడల్లా అబ్బాయి వచ్చి మీవ్యవహారాలు చూస్తూ వుంటాడు. మీకు అవసరంపడ్డప్పుడల్లా కాకితో కబురు చెయ్యండి, వెంటనే శెలవయినా పెట్టివస్తాడు."

వారిని బలవంతపెట్టడం మంచిపనిగా తోచలేదు జగన్నాధానికి. ఇక వాళ్లూ బ్రతకపొయ్యేది కొద్దికాలమే. పోనీ, వాళ్ల అనంతరమే తన అల్లుడు తమయింటికి వస్తాడనుకుని "పెద్దలు తమ మాటకు అడ్డుచెప్పగలనా బావగారూ" అని సంబాళించుకున్నాడు జగన్నాధం.

ఆసంవత్సరంలోనే అరవిందకు సారెయిచ్చి కాపరానికి పంపారు పుట్టింటివారు. కోడలు తెచ్చిన వస్తుసముదాయంతో నిండి వారి యిల్లంతా కళకళ్లాడింది. అరవిందఅత్త పని కట్టుకుని ఆరోజల్లా ఇరుగుపొరుగు అమ్మలక్కల్ని పిలుచుకవచ్చి కోడలుతెచ్చినవస్తువులు చూపించి తన ఆనందపు ఉద్ధృతాన్ని తగ్గించుకున్నది. తాను తెచ్చిన వెలగల వస్తువులు ఆయింట్లో ఎక్కడివి అక్కడ అమర్చి అరవింద తిరుగాడుతూవుంటే అయింటికి ఒక నూతనశోభ వచ్చింది. కోడలు ప్రవేశించగానే లక్ష్మి తమయింట అడుగుపెట్టినట్లుగా వున్నది వారికి.

కోడలు రావడంతోనే అత్తకూ కోడలికీ ఒకవిషయంలో కలహం ప్రారంభమయింది. కోడలు ధనవంతుల యింట్లో పెరిగింది; అవతలపుల్ల యివతల పెట్టియెరగదు; ఆమెను యేపనీ చెయ్యనివ్వకూడదని అత్తా, అత్తగారు పూజ్యులు; అందులో పెద్దవారయ్యారు; ఆమెను యేపనీ ముట్టనివ్వకూడదని కోడలూ. అత్త చేసే పనికి కోడలు అడ్డువెళ్లడం, కోడలు చేసే పనికి అత్త అడ్డువెళ్లడం ఇదీ వారి కలహకథ. ఆఖరుకు కోడలే గెలిచింది. తనమీద కాలుదువ్వినందుకు అత్తను నిర్బంధంలో వుంచి పగతీర్చుకున్నది కోడలు.

ఇక భార్య రావడంతోనే యిల్లొక స్వర్గంగా మారిపోయింది జనార్దనస్వామికి. భార్యాభర్తలకు ఒకళ్లంటే ఒక

ళ్లకి ఎంతో తీపి. ఎంతో గౌరవం. అతడు ఒంటరిగా ఆఫీసు కేమివెళ్లివస్తాడో అంతే: తతిమ్మా కాలమంతా భార్యను విడిచివుండడు.

అతనిది ముప్పైరూపాయిల నౌకరీ. అదివరకు వాళ్లు ఏవొక కూరతోనో గడుపుకునేవాళ్లు. అరవింద కాపరానికి వెళ్లాక ప్రతిరోజూ ఒక వేపుడూ, ఒక పులుసూ, ఒక పచ్చడీ, వారాని కోపిండివంటా ఇట్లా ఖర్చు అధికం అవటంవల్ల భర్త డబ్బుకు కసాలాపడుతున్న సమయం కనిపెట్టి అరవింద తన పెట్టెలోనించి కొంత పైకం తీసి భర్తకు యివ్వబోతుంది. అతడు "అవసరంలే"దంటాడు. "అవసరం లేదంటారేం? మన సొమ్ము మనం ఖర్చుచేసుకోవడానికి సందేహిస్తారేం?" అంటుందామె. "అవి నీ ఖర్చుకోసం తెచ్చుకున్నావు, వుంచుకో" అంటా డతడు. "ఖర్చుపెట్టడానికి నా కింతకంటే సద్వినియోగం ఏమీ కనిపించలేదండీ" అంటూ భర్తను వాడిచూపులతో లొంగదీసుకుని ఎట్లయితేనేం పైకం యిస్తుంది అరవింద. "చిన్నరాణీ వుండగా మాకేం కొదువ" అంటూ జనార్దనస్వామి చుంబనమో, లేక కౌగిలో ఆమెకు బహుమానం చేస్తాడు.

ఒకరోజున బిచ్చపుది వాళ్ల వాకిటిముందుకు వచ్చి "పాత బట్ట యేదైనా వుంటే యివ్వు తల్లీ!" అని దీనంగా అడుగుతూవున్నది. అరవిందఅత్త "లేదు వెళ్లిపొ"మ్మని బిచ్చపుదాన్ని కసిరికొడుతున్నది. అది వెళ్లడంలేదు, యింతలో అరవింద యింట్లోనుంచి బయటికివచ్చింది. బిచ్చపుదాని శరీరంలో యెముకలు సుళువుగా లెఖ్ఖపెట్టే టందుకు వీలున్నదికాని అది కట్టుకున్న చీరయొక్క చినిగినపేలికలనుమాత్రం లెఖ్ఖపెట్టడానికి దుస్సాధ్యం. దాన్ని చూస్తే అరవిందకు ఎంతో జాలివేసింది. "ఉండు అత్తయ్యా! నాపెట్టెలో వొక పాతచీర వుండాలి" అంటూ ఇంట్లోకి వెళ్లి తన దొక చీర తెచ్చి బిచ్చపుదాని కిచ్చి దాని చేతిలో కొంత చిల్లర పెట్టి వెళ్లిపొమ్మన్నది. అది చూసి అత్తగారు "అన్నపూర్ణ మాయింట్లో అవతరించిం"దని ఆనందపరవశురా లయిపోయింది. యింటిముందువసారాలో ఆఫీసుకాగితాలు చూసుకుంటున్న జనార్దనస్వామి తల యెత్తి చూసి "అరవిందకాదు; ఆశ్రితవింద" అని మనసులో అనుకుని మురిసిపొయ్యాడు.

3

ఒకసంవత్సరం గడిచింది. మహాలక్ష్మమ్మకు విషజ్వరం అంకురించింది. పూరివైద్యులవల్ల కాకపోవడంచేత జగన్నాథం గుంటూరునించి నిపుణులైన ఇంగ్లీషువైద్యులను పిలిపించాడు.వ్యాధి ఏమీతగ్గలేదు.జగన్నాథం వెనకా ముందూ చూడకుండా డబ్బును వెదజల్లాడు. లాభం లేకపోయింది. ప్రకృతి నెదుర్కొనేవారెవరు? మహాలక్ష్మమ్మ ఈ భౌతికదేహాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయింది.

మహాలక్ష్మమ్మచావుతో యీప్రపంచమంతా వట్టి మిథ్యగా కనిపించింది జగన్నాథానికి. "యీ దేహం నీటిమీది బుగ్గవంటిది. అది తెలుసుకోలేక బొందెలో ప్రాణం వున్నంతసేపూ అది నాది, యిది నాది అని ప్రాకులాడతారు వెర్రిమానవులు. ఈ ధనధాన్యాదులు కల్ల. భార్యాబిడ్డలు మిథ్య" అన్న శుద్ధవైరాగ్యంలోకి దిగిపొయ్యాడు జగన్నాథం. "ఇక ఈధనం,ఇల్లూ,వాకిలీ నాకెందుకు?" అనుకుని యిదంతా కూతురికీ అల్లుడికీ వప్పగించివేసి తాను కాశీ వెళ్లిపోయి మోక్షసాధనకు మార్గం చూసుకోవాలని నిశ్చయించేసుకున్నాడు. అసలే తల్లి పోయి దుఃఖంలో వున్న అరవిందకు ఈవార్త తెలియనిస్తే మరింత దుఃఖపడుతుందని ఆమెకు తెలియనివ్వకుండా అల్లుణ్ణీ, వియ్యంకుణ్ణీ ఏకాంతంగా పిలిచి ఇట్లా అన్నాడు. "నే నిక కాశీ వెళ్లిపోయి శేషించిన జీవితమంతా అక్కడే గడపదలచుకున్నాను. ఈ యావదాస్తీ మీరే చూసుకుంటూవుండవలసినది. నాకు నెలకు పాతికో పరకో పంపుతూవుండండి. నేనొకమాట మీకు చెప్పదలచుకున్నాను. మా అమ్మణ్ణి మీ రెలా చూసుకుంటారో. అది తల్లిలేని బిడ్డ! ఇక తండ్రికూడా లేనిదానిలో జమే! ఎంతో గారాబంగా పెరిగిన బిడ్డ. ఆమెకు ఏలోటూ జరగకుండా చూడాలి. యిదే నా తుది కోరిక". ఆఖరిమాటలు నోటివెంట వచ్చేటప్పటి కల్లా అతని కళ్ల వెంట బొటబొట నీళ్లు కారినవి. కంఠం రుద్ధం అయిపోయి యిక మాట్లాడలేకపొయ్యాడు. ఆమాటలు వినేసరికి అనుకోనంత త్వరలో తమకు కలగబోతున్న మహర్దశకు తండ్రికొడుకులు మనసులో ఉప్పొంగిపోతూ, పైకి వెళ్లవద్దని యెంతో దూరం ఆయనకు చెప్పారు.

శుభవార్తవిన్నదగ్గరనుంచి తండ్రీకొడుకుల ఆనందానికీ వూహలకీ అంతులేదు. "మామగారు అటువెళ్లిపోవడంతోనే వాళ్ల పూరికొంప వదిలివేసి మామగారి దివ్యభవనంలో కాలంగడపొచ్చు; తానిక వెధవసేవకావృత్తి చెయ్యనవసరం లేదు. తానే పదిమందికి యజమానిగా వుండి హాయిగా స్వతంత్రజీవనం చెయ్యొచ్చు. దగ్గరలో వున్న బెజవాడలో బిజినెస్ ఒకటిపెట్టి దానిమీద నలుగురు గుమాస్తాలను వేసి తాను కారొకటికొనుక్కుని రోజూవెళ్లి అజమాయిషీ కనుక్కుంటూ ఉండొచ్చు" అని జనార్దనస్వామీ; "కొడుకును ఒకవెయ్యి

రూపాయలడిగిపుచ్చుకుని వియ్యంకుడు ఉత్తరంబయలుదేరితే తాను దక్షిణయాత్రలకు బయలుదేరవలెననీ దక్షిణయాత్రలన్నీ పూర్తిచేసుకుని ఆఖరుకు కాశీవెళ్లితే అక్కడవున్న వియ్యంకుణ్ణి చూడవెళ్లినట్టూ వుంటుంది, కురదలాలేకుండా తనకు కాశీయాత్రాఫలంగూడా సిద్ధిస్తుంది; ఈవిధంగా తనకు ఎన్నాళ్లనుండో గల కోరికను తీర్చుకోవ"చ్చని వెంకటనారాయణ—ఇట్లా తండ్రీకొడుకులు గాలిమేడలు నిర్మించుకొంటున్నారు. ఆ ఆనందంతో ఆరాత్రి వాళ్లకు సరీగా నిద్రకూడా పట్టలేదు.

వారంవెళ్లి రెండోవారం వచ్చింది. రోజుగడిచినకొద్దీ ప్రపంచానికీ మానవునికీ ముడివేయబడిన ఆశాపాశం జగన్నాథాన్ని అతనిసంకల్పంనుండి ఒక అడుగు వెనక్కు లాగుతున్నది. కర్మ వెళ్లిపోయింది.అతడు కాశీవెళ్లిపోతానని అన్నమాటను చెల్లించుకోవలసిన కాలం వచ్చింది. "కాశీలో వున్న విశ్వనాధుడూ, మనఊరి ఆలయంలోవున్న విశ్వనాధుడూ ఎందుకు ఒకటికారు? శ్రమపడి వృథాగా అంత దూరం వెళ్లడం దేనికి?" అనుకుని జగన్నాథం ప్రతినిత్యం ఆవూరి శివాలయంలోకివెళ్లి పగలల్లా అక్కడ గడపడం మొదలుపెట్టాడు.

రోజుగడిచినకొద్దీ జగన్నాథాన్ని వెనుకకు లాగుతూవున్న ఆశాపాశం క్షణంగడిచినకొద్దీ జనార్దనస్వామినీ, అతని తండ్రినీ ఒక అడుగు ముందుకు వేయిస్తున్నది. "ఇంకా కాశీ వెళ్లడేం? ఇంకా కాశీవెళ్లడేం?" అని వాళ్లహృదయాలు మారుమోగుతున్నవి.

మూడోవారంవచ్చింది. "ఈశ్వరుణ్ణి సర్వాంతర్యామి అన్నారుగదా! అనవసరంగా శివాలయంలోకి వెళ్లడందేనికి? ఆదేవుడు ఇక్కడమాత్రం ఎందుకులేడు? మనోనిశ్చలం ప్రధానంగాని" అనుకుని జగన్నాథం శివాలయంలోకి వెళ్లడం మానివేసి ఇంట్లోనే ఏకాంతంగా కూర్చుని కొంతసేపు ప్రార్థన, కొంతసేపు సద్గ్రంథపఠన రోజంతా ఇట్లా గడపటం మొదలుపెట్టాడు. జగన్నాథం బయటికిరాకుండా యింట్లోనే గడపటంచూసి తండ్రీకొడుకులు "ఇంతవ్యవహారం చప్పున వదిలిపెట్టి వెళ్లడమంటే మాటలా! రావలసిన బాకీలూ, నిల్వరొఖ్ఖం, వున్నభూములూ, యిట్లా అవీ శ్రద్ధపట్టి లెక్కలు తేలుస్తున్నాడు. లెఖ్ఖలుతేల్చి యిచ్చిగాని ప్రయాణంకట్ట"డని నిశ్చయించారు.

నాలుగోవారంవచ్చింది. "భక్తితో ఈశ్వరునినామం ఒక్కపర్యాయం స్మరించినంత మాత్రంచేతనే ఎందరోభక్తులు తరించినట్లు చరిత్రలువుండగా రోజంతా ఇట్లావృథాచెయ్యడం దేనికి?" అనితలచి జగన్నాథం అందులో సగం కాలాన్ని ఇంటివ్యవహారాలకు వినియోగించి వాటిని పునరుద్ధరించాడు. అయినా ఆశాదేవత జనార్ధనస్వామీ వెంకటనారాయణా హృదయవీథుల్లో విహరించడం మానలేదు. ఇంకా అతడు కాశీవెళతాడనే వాళ్లు ఎదురుచూస్తున్నారు.

నెలవెళ్లి ఒకరోజు గడిచింది. అది చైత్రమాసం. రాత్రిపూట ఇంట్లో ఉక్కపోస్తూవున్నందువల్ల ఆవేళ ఆరుబైట మంచంవేయించుకుని పండుకున్నాడు జగన్నాథం. అది శుక్లపక్షం. పిండిఆరబోసినట్టు వెన్నెలకాస్తున్నది. దూరాన్నుంచి కోయిలమధురగానం వినవస్తున్నది. పందిరికి అల్లబడిన సన్నజాజిపూలమీదినుండి వచ్చే సుగంధం అప్రాంతమంతా ఘుమాయిస్తున్నది. జగన్నాథానికి నిద్రపట్టడంలేదు. నిజానికి చల్లనిగాలి వీస్తూవుండె. పైగా చల్లనివెన్నెల కాస్తూవుండె. ఎందుకు నిద్రపట్టదు మరి? వసంతుడు అతనివెన్ను చరిచాడు, ఆవెన్నెలతాకుడుకు మిగిలిన వైరాగ్యంకాస్తా సూర్యరశ్మికి విడిపోయిన మంచువలె విడిపోయి హఠాత్తుగా అతనికి రాగోదయమై పూరుకుంది. అతని తలపులన్నీ శృంగారరసంలో మునిగితేలుతున్నవి. చంద్రుడు తెల్లనిఇస్త్రీమడతలనువేసుకుని షోగ్గా ఏప్రియురాలిదగ్గిరికో ప్రయాణం కట్టాడు. తెల్లమేఘాన్నివడిసిపట్టుకుని ఒక నల్లమేఘం ముద్దుపెట్టుకుంటున్నది. కాముకుడిబారినుండి తప్పించుకు వెళ్లే యువతివలె ఒకమేఘం ముందు పరుగెత్తుతూవుంటే వేరొక మేఘం వెంటబడి తరుముతున్నది. వసారాచూరులో గూడుపెట్టిన పిచ్చుకల జంట గుసగుసలాడుకొంటున్నవి, అతని మంచానికి దాపులో వున్న రెండుగులాబిమొక్కలు గాలిని తోడుచేసుకుని కావిలించుకొంటున్నవి. ఆరాత్రంతా అతనికి జాగరణ.

ఆతెల్లవారి సూర్యోదయం కాకముందే మంగలి యింటికి వచ్చాడు. నెలరోజులనుండీ యెదిగిన గడ్డాన్ని నున్నగా గీయించి మీసాల్లోవున్న తెల్లని వెంట్రుకలన్నీ తీయించి వేసి శరీరం యెర్రగా కందేటట్టు గంటన్నరసేపు నలుగుపెట్టించుకొని స్నానంచేసి ఇస్త్రీమడతలువేసుకొని పెండ్లికొడుకులాగా తయారయ్యాడు జగన్నాథం. అతని హృదయంలో నిలుపుకుని ఆరాధిస్తున్న ఈశ్వరుణ్ణి గెంటివేసి ఆస్థానాన్ని సుందరాంగి ఆక్రమించుకున్నది. అదివరకు బట్టలకు వేయించుకోవాలని తెచ్చి అలమరలో వుంచిన కావిరంగుపొట్లం దూరంగా పారవేయబడి ఆస్థానాన్ని వెంట్రుకలకు వేసుకునే నల్లరంగు అలంకరించింది. జగన్నాథం మామూలు మనిషి అవడమే కాకుండా పాతికేళ్ల పడుచువాడుకూడా అయ్యాడు. ఇక వధువుకోసం అన్వేషణ ప్రారంభమయింది.

జగన్నాధంవివాహఝుంఝూమారుతం జనార్దనస్వామి, వెంకటనారాయణల ఆనందజ్యోతిని ఆర్పివేసి వాళ్ల ఆశాసౌధాన్ని పునాదులతోగూడా కూలదోసి విడిచి పెట్టింది. తమకు చెందుతుందనుకున్న ఆస్తి అతడు మళ్లీ పెళ్లిచేసుకుంటే ఎలాచెందుతుంది? ఆస్తి అంతా కూతురికే నని ముందు చెప్పి పెద్దమనిషి ఇప్పు డీ పనికి పూనుకుంటాడా ? తండ్రీ కొడుకులను దిగులు, చింత, ద్వేషం జలగల్లా పట్టుకున్నవి. ఈనెలరోజులనుంచి వాళ్లకుటుంబం జగన్నాధంఇంట్లోనే వుంటున్నది. ఇక అక్కడ ఉండకూడదనుకుని స్వగ్రామం వెళ్లిపోయేటందుకు వాళ్లు మూటాముల్లే సర్దుకుంటూ వుండగా జగన్నాధం చూసి వాళ్ల ఉద్దేశ్యం కనిపెట్టి తండ్రీకొడుకులను ఏకాంతంగా పిలిచి వియ్యంకుణ్ణి "బావగారూ!" అన్నాడు. అల్లుణ్ణి "అబ్బాయీ!" అన్నాడు. "ఇప్పుడు మీరు వెళ్లిపోవడానికి కారణ మే మొచ్చింది? నేనిప్పుడు వివాహంచేసుకున్నందువల్ల మా అమ్మాయికి అన్యాయం జరుగుతుందని మీరెన్నటికీ అనుకోవద్దు. ఆమెకంటే నాకు ముఖ్యు లెవరు? నేను యెవరి కిచ్చేది వాళ్ల కే ఇస్తాను. ఒకళ్లకిస్తే ఒకళ్లు తృప్తి పడకపోవడానికి ఇదేం కాస్తా కూస్తా ఆస్తికాదు. ఇప్పటిధరలనుబట్టి కిమ్మతుకడితే మూడులక్షలకు పైచిలుకుమాటే కాని తగ్గదు. మీరేమనుకున్నారో? ఇచ్చింది చెడగొట్టుకోకుండా కాపాడుకుంటే పిల్లపిల్లతరానా అనుభవించవచ్చు. అదీ నేను ఇప్పుడైనా చేసుకునేవాణ్ణి కాదు. స్నేహితులూ, బంధువులూ నీకేం ఈడు మించిపోయిందని బలవంతం చేయడంవల్ల తలవూపక తప్పిందికాదు" అన్నాడు. తననెవరూ బలవంతంచెయ్యకపోయినా కమ్ముకోకతప్పిందికాదు జగన్నాధానికి.

అతనిమాటలు విని తండ్రీకొడుకులు చల్లపడ్డారు. జగన్నాధానికి ఆగ్రామంలోనే సమ్మంధం కుదిరింది. పిల్ల పెద్దది. కొద్దిగా చదువుకున్నదికూడా. వివాహం జరిగిపోయింది.

పెండ్లయిన మాసంలోనే దుర్గమ్మ కాపరానికివచ్చింది. ఆమెను అరవింద "పిన్నీ!" అని పిలుచుకుని ఆనందపరవశురాలయిపోయింది. మళ్లీ జంట బస్తీకావడంతోనే జనార్దనస్వామి కుటుంబం అరవిందతోసహా ఏలూరు వెళ్లిపొయ్యారు.

౪

సంవత్సరం పెళ్లి రెండో సంవత్సరం వచ్చేటప్పటికల్లా దుర్గమ్మ కొడుకుని కన్నది. వయసుభార్య! అందులో మగసంతానం! బంగారపు కంచం, పాయసం- అంతకంటే తృప్తినిచ్చే దేముంటుంది? వీణా, అఠాణారాగం! అంతకంటే ఆనందాన్నిచ్చే దేమున్నది ? పూలవనం, మందమారుతం! సుఖానికి లోటేమిటి? అద్దాలమహలు, మణిదీపం! అంతకంటే భాగ్యమేమున్నది ? అల్లుణ్ణీ కూతుర్నీ వచ్చి చూసిపోవలసిందని సంతోషంతో ఏలూరుకు ఉత్తరం రాశాడు జగన్నాధం.

పోష్టుజవాను ఇచ్చివెళ్లిన ఆవుత్తరం చదువుకునేసరికి జనార్దనస్వామిముఖం కళావిహీనమయింది. తనకు తమ్ముడు పుట్టాడన్న వార్త వినేసరికి అరవిందముఖం వికసించింది. ఆమెఆనందానికి అంతు లేదు. భర్తతోకూడా తన తమ్ముణ్ణి చూసేటందుకు వెళ్లుతుంది: అక్కడ వున్న నాలుగురోజులూ పాపాయితోనే గడుపుతుంది: వెళ్లేటప్పుడు తన చిట్టితమ్ముడికి గిలకపండ్లూ అవీ పట్టుకెళ్లుతుంది; తమ్ముడు పెద్దయ్యాక తనను అక్కా అని పిలుస్తుంటే తా నెంతో ఆనందిస్తుంది— యిటువంటి తలంపులతో ఆ సంతోషవార్త అత్తగారితో చెప్పటానికి ఇంట్లోకి పరిగెత్తింది అరవింద.

ఇంతలో వీధిలోనుంచి ఇంట్లోకి వచ్చిన వెంకటనారాయణ వుత్తరం పట్టుకుని విచారంతో వున్న కొడుకును చూసేటప్పటికల్లా యేఆప్తులదగ్గిరినుంచి అశుభవార్త వచ్చిందోనన్న గాభరాతో "ఎక్కడనుంచి వచ్చిందిరా వుత్తరం అబ్బాయీ?" అన్నాడు ఆదుర్దాగా.

"మామగారికి కొడుకు పుట్టాడుట" అన్నా డతడు.

తొలీగా కొడుకును చూసి యే చెడువార్తని గాభరా పడ్డాడో యీవార్తా అటువంటిదే అయిం దతనికి. "ఆస్తి అంతటికీ వారసుడు పుట్టాడు! మన కింకేం వస్తుంది?" అన్నాడు వెంకటనారాయణ శత్రువు రాజ్యాన్ని ఆక్రమించిన ఆసామీముఖం వేసి.

"అతడు యెప్పుడైతే రెండోపెళ్లి చేసుకున్నాడో లా ప్రకారం మనకేమీ రాదు"

ఇంకా అత దేదో అనబోతూవుండగానే వెంకటనారాయణ అడ్డువెళ్లి "అట్లని ఊరుకోవలసిందేనా?" అన్నాడు ఆదుర్దాగా.

"చెప్పేదంతా సాంతంగా వినవయ్యా. యెట్లా వూరుకుంటాం? అతడు మనకు వ్రాసియిస్తా నన్నాడుగదా. అడిగి వ్రాయించుకుందాం"

"వ్రాసియివ్వద్దూ? మొదట మొత్తంఆస్తీ పిల్లకే అన్నారు. రెండోపెళ్లి చేసుకునేటప్పటికి సగమయింది. యిప్పుడు కొడుకు పుట్టాక ఇంకెంతవుతుందో! లేక అసలే గల్లంతౌతుందో!"

"అట్లా జరగకూడదు నాన్నా. పెద్దమనిషి అన్న మాట తప్పుకుంటాడా? కూతురంటే అతని కెంతో ప్రేమ. అది మనకు తెలిసినవిషయమేగదా, అటువంటివాడు కూతుర్ని అన్యాయంచేస్తాడా?"

"అట్లనుకుని తృప్తిపడి ఇక నీళ్లనములుతూ వూరుకుంటే ప్రయోజనం లేదోయి అబ్బాయీ"

"యెట్లా వూరుకుంటాం? అడుగుదాం, యింకా అగుతామా?". అని క్షణం ఆగి "అయితే; అడిగేటందుకు యిది సమయం కాదనుకుంటాను" అన్నాడు జనార్దనస్వామి.

"సమయమేమిట్రా సమయం! వొకవేపునుంచి ముంచుకొస్తూవుంటేనూ"

"కొడుకుపుట్టినవెంటనే వెళ్లి అడగడం అంతబాగుండదు. తొందరపడి చేసేది లేదు. ఆయనమనసుకు నొప్పి కలగకుండా శాంతంగా మందలించి వ్రాయించుకోవాలి. అంతకంటే మనకు వేరేమార్గం లేదు"

"అదను పోగొట్టుకున్నతర్వాత అంతకంటే ఇంకేముంటుంది? అసలు పెండ్లికాలమందే వ్రాయించుకోవలసింది. యిప్పుడనుకుంటే ఏం లాభం?" యీమాటలు అనేటప్పుడు రైల్లో పర్సు తీసి లెక్కపెట్టుకుంటూవున్న నోట్లు గాలికి కిటికీలోనించి కొట్టుకుపోయినవాడి ముఖం వేశాడు వెంకటనారాయణ.

"అప్పు డెట్లా వ్రాయమని అడుగుతాం? అడిగేటందుకు వీలేదీ? ఇంకా వారికి వేరే సంతానం ఏమన్నా వున్నది కనకనా? వున్నది ఒక్కపిల్లాయె. ఒకవేళ వ్రాయమని అడిగినా వాళ్లు వ్రానేవారా? యింతకీ అత్తగారు పోవడంవల్ల యిన్ని చిక్కులూ" అన్నాడు జనార్దనస్వామి.

"అంతే! ఆయిల్లాలేగనక బతికివుంటే యిన్నిచిక్కులు వుండేవా మరి?"

"ఆమె అట్లా అకస్మాత్తుగా పోతుందని కలలోనైనా అనుకున్నామా?"

"అదీ మన దురదృష్టమేరా. కాకపోతే ఆమె బతికివుండి ఇతను పోరాదూ?"

"మన దరిద్రదేవత మృత్యుదేవతై ఆమెను మింగివేసింది"

"అంతేరా నాయనా! మహాలక్ష్మమ్మేగనక బతికివుంటే లక్ష్మి మన యింటికి తనంతట తానే నడిచివచ్చేది. జరిగిందేమో జరిగిపోయింది. యిక త్వరపడి వ్రాయించుకోవాలి."

* * *

ఆరుమాసాలు గడిచినవి. జనార్దనస్వామీ, వెంకటనారాయణా గోవర్ధనపురం వెళ్లారు. అల్లుడూ వియ్యంకుడూ జగన్నాథంగారి గడపతొక్కేటప్పటికల్లా నేతితో నిండిన కళాయి పొయ్యిమీది కెక్కింది. ఆపూట పిదికిన పాలలో తోడువెయ్యలేదు. తోటలో చెట్లపాదుల బరువు తగ్గిపోయింది. ఆపగలల్లా గడచిపోయింది. రాత్రి భోజనాలయ్యాక జగన్నాథం, జనార్ధనస్వామి, వెంకటనారాయణ ముగ్గురూ డాబాపైకి వెళ్లి తాంబూలాలు వేసుకుంటూ లోకాభిరామాయణం ప్రారంభించారు. అడగటానికి యిదే సమయం అన్నట్టు జనార్దనస్వామి తండ్రివంక చూశాడు. దాన్ని కనిపెట్టి వెంకటనారాయణ అందుకున్నాడు. "తమ కీసంవత్సరం యెన్నిపుట్ల ధాన్యం అయింది బావగారూ?" అన్నాడు సంభాషణ మార్చి.

"మాకా? ఈసంవత్సరం గింజ బాగానే రాలింది. యాభైపుట్ల వడ్లూ, పాతికపుట్ల కందులూ, పదిపుట్ల పెసలూ, పదిపుట్ల మిర్చీ అయినవి" అన్నాడు జగన్నాధం.

"పిల్లజమీందార్లు-మీకేం బావగారూ! అయితే నే నొక మాట అనదలచుకున్నాను. మీరు వ్రాస్తామన్న ఆస్తి అమ్మాయిపేర వ్రాసివేస్తే బాగుంటుంది. యెప్పటిమేలప్పుడే"

"ఇప్పు డేమంత తొందర వచ్చింది? నేను వ్రాయనని మీకే మన్నా అనుమానం వేసిందా?"

ఆమాటకు తండ్రీకొడుకు లిద్దరూ ఒక్కమారుగా "అబ్బే! యెంతమాట సెలవిచ్చారు" అన్నమీదట వెంకటనారాయణ ఆపకుండా చెప్పుకెళ్లుతూవున్నాడు. "మీరు వ్రాయరని కాదు బావగారూ, ఈజీవితం శాశ్వతమైంది కాదు. కాళ్లూ చేతులూ చల్లగా వున్నప్పుడే వ్రాసివేస్తే బాగుంటుందని మావుద్దేశం"

"మా కాలాటి అనుమానం యెందు కుంటుంది మామగారూ? మీ అమ్మాయిక్షేమం కోరే విషయంలో మీకంటే మేమేమీ అధికులం కాము. మీరు వ్రాయరని ఎలా అనుకుంటాము? ఆ శ్రద్ధ మీకుగాక మరెవరికి? మేమనే దేమిటంటే, మీఅనంతరం వున్నవాళ్లు చిక్కులుపడకుండా చెయ్యమని" అన్నాడు జనార్దనస్వామి. "అంతే అంతే బావగారూ! మేము కోరేది. మీకు మేము చెప్పేటంతటివాళ్లము కాము" అని అందుకున్నాడు వెంకటనారాయణ.

ఇక జగన్నాధం ప్రారంభించాడు: "వ్రాయడానికి నాకేమీ సందేహం లేదు. యెప్పుడైనా వ్రాసేదే కాని, యిప్పుడే వ్రాసేటట్లయితే కొన్ని చిక్కులు వున్నవి. అవి

గూడా మీకు చెబుతున్నాను. నేనా చేసుకున్నది రెండోపెళ్లి! అమ్మాయిపేర వ్రాయడంతోటే మాకుకూడా వ్రాయమని అవతలవాళ్లు తప్పకుండా కూర్చుంటారు. అప్పుడు యిద్దరికీ మొత్తం ఆస్తి వ్రాసియివ్వవలసివస్తుంది. అందువల్ల వూళ్లో నా పరపతికీ, గౌరవానికీ హానివస్తుంది."

జనార్దనస్వామి అడ్డువచ్చి అన్నాడు: "వాళ్లు తమపేర వ్రాయమని యెందుకు కోరడం? కోరే అవకాశం కలగదనుకుంటాను. మీరన్నప్రకారం మీఅమ్మాయిపేర సగం వ్రాసివేస్తే మిగతాసగం మీపేరనే వుంటుంది. మీపేర వున్న ఆస్తి లాప్రకారం మీఅనంతరం వాళ్లకే చెందుతుందిగదా?"

ఇంతలో దుర్గమ్మ ఏపనిమీదనో డాబాపైకి వచ్చింది. జగన్నాధం ఏదో చెప్పబోతున్నవాడల్లా ఆమెను చూసి ఆపాడు. దుర్గమ్మ వెళ్లిపోయినతర్వాత అన్నాడు:

"అట్లని వాళ్లు వూరుకోరు. అబ్బాయీ! నువ్వింకా చిన్నవాడివి. లోకానుభవం తక్కువ. బావగారు అంతా గ్రహించేవుంటారు. ఎప్పుడైతే అమ్మాయిపేర సగమాస్తి పెట్టానో అప్పుడు యిక నన్ను వాళ్లు నమ్మే అవకాశం యెట్లా వుంటుంది? ఇట్లాగే తతిమ్మాఆస్తికూడా వాళ్లకు చెందకుండా దుబారుచేస్తానని అనుకోవచ్చు. ఇప్పుడు అమ్మాయిపేర వ్రాయగానే తప్పకుండా వాళ్లూ వ్రాయమని కూర్చుంటారు. అంతవరకు నిజం. తీగ లాగితే డొంకంతా కదులుతుంది. తొందరపడవద్దు. మీ రిప్పుడేమీ అదుర్దాపడే అవసరం లేదు. నా శరీరపటుత్వాన్నిబట్టి చూస్తే ఇంకా నేను చాలానాళ్లు జీవిస్తాను. యిప్పట్లో నాకేమీ పరవాలేదు. ఆఖరుకు నేను ఒకమాట చెపుతున్నాను. ఆస్తి నాబిడ్డపేర పెట్టకుండా బొందెలోనుంచి యీప్రాణాలు లేచిపోవు. నిజంగా నమ్మండి"

జగన్నాథం చెప్పిన సమాధానం తండ్రీకొడుకులకు తృప్తిని కలిగించకపోయినా అతడు చూపిన కారణాలనుబట్టి ఏమీ మాట్లాడలేకపొయ్యారు.

౫

జగన్నాథం వధువుకేలుపట్టిన వేళావిశేషం యెటువంటిదో కాని రత్నాలవాన కురిసినట్టు ఇల్లంతా మగబిడ్డలు. మళ్లీ సంవత్సరం వెళ్లి రెండోసంవత్సరం వచ్చేటప్పటికల్లా దుర్గమ్మ కవలపిల్లలను కన్నది. ఇద్దరూ మగపిల్లలు. యీ వార్త అరవిందఅత్తవారికి జోడుగుళ్లబారువలె పోయి తగిలింది.

జగన్నాధానికి తొలిసారి కొడుకు పుట్టడంతోనే అరవిందఅత్తవారికి ఆమెపైన పూర్వం వాళ్ల కున్న ప్రేమగౌరవాలు కొంత తగ్గినవి. మళ్లీ యిప్పు డీ పుత్రద్వయం కలిగిందన్న వార్త వినగానే వారు అరవిందతో సరీగ్గా మాట్లాడడమే మానివేశారు. భర్త ఆమెతో అనుమతిగా వుండడం లేదు. అత్తమామలు ఎడముఖం పెడముఖంగా వుంటున్నారు. యిది ఆమె సుకుమార హృదయానికి చాలా బాధ కలిగించింది. వాళ్ల కోపకారణ మేమిటా అని ఆమె ఆలోచించింది. తనవల్ల ఏమీ లోపం లేదు. తాను ఎవరికీ కోపంవచ్చే పనిగూడా చెయ్యలేదు. మరి తానంటే ముగ్గురికీ గిట్టకపోవడానికి కారణం యేమైవుంటుంది? అదంతా తన పుట్టింటిమీది కోపమే నని గ్రహించుకున్నది.

ఆనాటి రాత్రి పడకగదిలో అరవింద భర్తమంచం మీద కూర్చుని "ఏమండీ! నామీద కోపంగా వుంటున్నారు దేనికి?" అన్నది. అతడు పలకలేదు. "ప్రతిపనికీ అత్తగారినే పిలుస్తుంటిరి. మధ్యాన్నం పండు యివ్వవస్తే పుచ్చుకోకపోతిరి. అదంతా ఎందుకు? యిట్లా మంచంమీద నేను కూర్చుంటే ఎప్పుడైనా మౌనంగా వూరుకుని ఎరిగున్నారూ? అత్తగారుగూడా సరీగా పలకటం లేదు. మామగారు అమ్మాయీ అమ్మాయీ అంటూ ఎంతో ఆదరణతో పిలిచేవారు: వారూ సరీగా మాట్లాడటం లేదు. ఆ కారణ మేమిటో నా కెలా తెలుస్తుందండీ?" అన్నది.

"ఎవరికైనా ముందుమాటలు తర్వాత వుండవు. అన్నప్రకారం జరిపే దెంతటివాళ్లో" అన్నా డతడు.

"ఎవరికి ముందుమాటలు తర్వాతలేవు? ఎవరు అన్నప్రకారం జరపలేదు? ఏమిటండీ?" అన్నది అరవింద.

"తెలియదా? నీతండ్రి!" అన్నా డతడు.

అప్పుడు ఆమెకు అర్థమయింది. సంవత్సరంక్రిందట తన భర్తా, మామా గోవర్ధనపురం వెళ్లివచ్చి ఆస్తివీళ్ల వ్రాయమని అడిగినట్టూ, ఆయన తర్వాత వ్రాస్తానని చెప్పినట్టూ వాళ్లు అనుకున్న మాటలు కర్ణాకర్ణికగా తాను వినివున్నది. తన పనేమో తానేమో గాని వేరే గొడవలు ఆమెకు అసలే పట్టవు. మధ్య తీరికసమయంలోగూడా పుస్తకం చదువుకోవటమో, లేక కుట్టుపనో చేస్తుంది. అదేమిటని యీమె వాళ్లను అడగనూలేదు; యిదిట్లా జరిగిందని వాళ్లు యీమెకు చెప్పనూలేదు.

"ఆస్తి వ్రాసే విషయమా?" అన్నది అరవింద.

"అది గాకపోతే యింకేమున్నది?"

"మళ్లీ యిప్పుడు ఆయనను వ్రాయమని అడిగితే కాదన్నాడా ఏమిటండీ?"

"మళ్లీ ఎవరడిగా రంటావు?"

"మరి మీభయానికి కారణమేమిటి?"

"తెలియదూ, మళ్లీ కొడుకులు పుట్టిన సంగతి?"

"మీకోపానికి కారణం అదేనటండీ! వాళ్లకు యింకా ఎంతమంది కొడుకులు పుట్టినా మన విషయంలో వ్రాయరన్న అపనమ్మకం మీకేమీ వద్దు"

"వ్రాస్తాడని ఏమి టానమ్మకం? కొడుకులు పుట్టిన కొద్దీ అతని మనస్సు మారిపోవచ్చు"

"మానాన్ననుగురించి మీరట్లా ఎన్నటికీ అనుకోవద్దు. ఆయన అన్నప్రకారం తప్పక వ్రాసితీరతాడు"

"ఎప్పుడో వ్రాస్తాట్ట! వ్రాస్తాడని ఏమి టాగ్యారంటీ! అప్పటికి రాజెవరో, రెడ్డెవరో!"

"ఆయననుగురించి మీ కేలాటి అనుమానమూ వద్దు. మానాన్న సంగతి మీకు తెలియదు."

"కొడుకులు జాస్తీఐనకొద్దీ ఆస్తి పంచుకుంటానికి వాళ్ల కే చాలదనుకుని నీకు ఎగరగొట్టవచ్చు"

"మానాన్నకు తమ్ములు వొకటీ నేను వొకటీ కాదు. వాళ్లను ఎక్కువా, నన్ను తక్కువా చూస్తా డనుకున్నారా? ఆయ నట్లా ఎన్నటికీ చెయ్యడు"

"నువ్వు చిన్నదానివి. యిటువంటి పెద్దవిషయాలు నీకేం తెలుసు? అటువంటి పిచ్చినమ్మకాలమీద ఆధారపడితే లాభంలేదు. ముందుగానే బిగించుకోవాలి"

"మీ కెందుకు? ఆయనచేత వ్రాయించే భారం నాది. నామాట నమ్మండి"

"యెప్పటి సంగతో యిప్పుడు నువ్వెట్లా భారపడ గలవు? అప్పటికి నీమాట ఆయనవింటాడని ఏమి టానమ్మ కం? ఇప్పటి నీమీది[ప్రేమ అప్పటికి లేకపోవచ్చు"

"పోనీ, యిప్పుడే వ్రాయవలసిందని అడగండి"

"మేము అడిగితే వ్రానేటట్లయితే యింకేం?"

"నన్ను అడగమన్నారా?"

"అడగమనాలా? ఇంకో తెలివికల ఆడపడు చైనట్ల యితే వాకిటిముందు కూర్చుని మరీ వ్రాయించుకోకపోయిం దనుకున్నావూ? నీపేరుతోనేగదా మేము వ్రాయమనటం? అసలు వాళ్ల కే శ్రద్ధ లేనప్పుడు యెవరేం చేస్తారు?"

"యీవిషయం యిదివరకు ఎప్పుడైనా నాకు చెప్పా రటండీ? ఇప్పుడేగా నాకు తెలియడం? యిక అడుగుతాను"

"అడగడమేకాదు; పట్టుపట్టి మరీ వ్రాయించుకోవాలి. నీతండ్రికి నీమీద యెంతప్రేమున్నదో యిప్పుడు కనపడాలి!"

"మీరు చెప్పినప్రకారం గట్టిగా అడిగి వ్రాయించు కొస్తాను. మీరుమాత్రం నామీది కోపాన్ని తీసివేసుకోండి. యీరెండురోజులనుంచీ మీరు సరీగా మాట్లాడకపోతే నాకు రెండు రోజులూ రెండు యుగాల్లాగా వున్నవంటే నమ్మండి"

రెండురోజులు ఆగినతర్వాత జనార్దనస్వామి అర విందను వెంటపెట్టుకుని వెళ్లి పుట్టింట దిగవిడిచివచ్చాడు.

తండ్రి హాల్లో ఒంటరిగా వుండగా అరవింద వెళ్లి అతని దగ్గరగా కుర్చీలో కూర్చున్నది. "ఏమమ్మా! ఏమిటి విశేషాలు?" అన్నాడు అనురాగపూరితమైన స్వరంతో జగ న్నాధం.

"ఆస్తి వ్రాయమని అడిగారుటగా నాన్నా?"

"అవును తల్లీ! ఆ విషయమై యిప్పు డేం వచ్చింది?"

"యెప్పుడో వ్రాస్తా నన్నావుటగా నాన్నా."

"అవునమ్మా, వీలుచూసి వ్రాస్తానని చెప్పాను. వాళ్ల నిన్నడగమన్నారా తల్లీ ?"

"అవును నాన్నా,"

"నీచేత అడిగించవలసివచ్చిందీ తల్లీ ? అన్ని విష యాలూ నేను వాళ్లతో మాట్లాడాగా,"

"యెప్పుడైతే నేం, యిప్పుడే వ్రాసివెయ్యి నాన్నా."

ఈ మాటలు అనేటప్పుడు అరవింద కంఠధ్వనిలో గారాబం ఇమిడి ఉన్నది. కాని ముఖంలోమాత్రం విచార రేఖలు పొడచూపినవి. ఆమెముఖంలో మార్పును కనిపెట్టి జగన్నాథం "నిన్నేమన్నా వాళ్లు అన్నారా అమ్మా ?" అన్నాడు తత్తరపాటుతో. ఏమీ అనలేదన్నట్టు తలకాయ మాత్రం తిప్పింది అరవింద. అంతటితో అతనికి మనశ్శాంతి కలగక లేచి కూతురి తల నిమురుతూ "చెప్పుతల్లీ! నాదగ్గర దాచబోకు. నీ కష్టసుఖాలు నాకు గాక మరెవరికి చెప్పుకుం టావు?" అన్నాడు. తండ్రిచేతులో పసికూన అయిపోయింది అరవింద. ఆమెకళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లినవి. "వాళ్లు నాతో సరీగా మాట్లాడ్డం లేదు నాన్నా" అన్నది.

ఆ కాస్త మాటను పురస్కరించుకొని కూతురికి ఎంతో కష్టం కలిగినట్టు కన్న హృదయం కంపించింది. "నిన్ను వత్తిడిచేస్తున్నారా తల్లీ! ఎంతోదూరం వాళ్లకు చెప్పాను. వాళ్ల పట్టు వాళ్లదేగాని మంచిచెడ్డలు వద్దూ?

ఇటువంటివాళ్లని నేనెన్నడూ అనుకోలేదు. నీసుఖంకంటే నాకష్టసుఖాలుగూడా నాకు ఎక్కువైనవి కావు తల్లీ. ఇక వ్రాసివేస్తాను" అన్నాడు.

వీళ్ల సంభాషణ అంతా దుర్గమ్మ కిటికీఅవతల వుండి ఆలకిస్తున్నది.

౬

ఆమర్నాడు భర్త తోటకు వెళ్లినప్పుడు పుట్టింటికి కబురువెళ్లింది. దుర్గమ్మతండ్రి రెక్కలుకట్టుకుని వచ్చి వాలాడు. తండ్రీకూతుళ్లిద్దరూ చాలాసేపు గుసగుసలు చేశారు.

రాత్రిపూట భోజనం అయ్యాక జగన్నాధం గదిలో మంచంమీద కూర్చున్నాడు. దుర్గమ్మ వాడుకప్రకారం వెండి పళ్లెంలో ఆకులూ, వక్కపొడీ వుంచి మంచంముందు ముక్కాలిపీటమీద పెట్టి భర్తకు ఎదురుగా నిలుచున్నది. తాంబూలచర్వణం చేస్తూ జగన్నాధం ఎదురుగా నిలుచున్న అర్ధాంగితరుణ అవయవసౌష్ఠవాన్ని తిలకిస్తూ ఆనందంలో మునిగిపొయ్యాడు.

"ఇందాకా అరవిందతో ఏమిటి వ్రాస్తా నంటున్నారు?" అన్నది దుర్గమ్మ.

ఈమాటలు హఠాత్తుగా వినవచ్చేసరికి ఉలిక్కిపడ్డా డతడు. రెండవకంటివాళ్లకు తెలియకుండా వ్రాసి వెయ్యాలని అతని సంకల్పం. ముఖ్యంగా ఎవరికి తెలియ కూడదని అత డనుకున్నాడో వాళ్లకే తెలిసింది. సమర్థించ టానికి అతని బుఱ్ఱ పనిచేస్తున్నది.

"ఆ, ఏమీ లేదు. అది వేరేవిషయం. చూడు, మొన్న నీతమ్ముడి పెండ్లికి ఏదో సహాయం చెయ్యమని ఆడిగావు కదూ? ఎంత యివ్వమన్నావు, చెప్పు. పాపం, వాళ్లూ పేద వాళ్లు!" అన్నాడు సంభాషణ మార్చివెయ్యాలని.

"ఏమీ లేదంటారేం? నాకు తెలియదనుకొన్నారా? మీరనుకొన్న మాటలన్నీ విన్నాను. మాతమ్ముడి పెండ్లి సంగతి అడ్డంతెచ్చిపెడతారేం? ఆసంగతి యిప్పుడు మిమ్మల్ని యెవరడిగారు? ఆఖరుకు నన్ను మరపించాలనికూడా చూస్తు న్నారు. ఆస్తంతా కూతురిపేర పెట్టి పిల్లల్నీ నన్నూ యేం చెయ్యతలుచుకున్నారు?" అంటూ దుర్గమ్మ పమిటచెంగుతో కళ్లు అద్దుకున్నది.

"ఆస్తంతా పెడతా ననుకున్నావా యేమిటి? మిమ్మల్ని మాత్రం చెడగొట్టుకుంటానా? ఆస్తంతా పెడతాననేనా నువ్వు ఇంత ఇదికావటం? పిచ్చిపిల్ల! అట్లా నువ్వెన్నటికీ అనుకో బోకు. ఆమె ఎక్కువా మీరు తక్కువా కాదు. ఉభయులూ నాకు సమానులే"

"అంతా కాకపోయినా కొంతమాత్రం ఎట్లా వ్రాస్తారు? మగబిడ్డ లుండగా ఎవరైనా ఆడపిల్లకు ఆస్తి కట్టబెట్టేవా ళ్లున్నారా?"

"ఈసందర్భం వేరు. అమ్మడి వివాహకాలంలో జరిగిన మాటలు నీకేం తెలుసు? అప్పుడు ఆస్తంతా ఆమెదే నని అన్నాము; అటువంటప్పుడు సగమైనా వ్రాయకపోతే ఎట్లా?"

"సగం కాదు గదా, ఆఖరుకు పూచికపుల్లయినా ఇచ్చేటందుకు వీల్లేదు."

"ఇదిగో, నువ్వు చిన్నదానివి. ఇటువంటి వ్యవహా రాలు నీకు తెలియవు. ఇదేం ఎంతమంది పంచుకున్నా తరిగే ఆస్తి కాదు. వ్రాయకపోతే వీల్లేదు. అడ్డం చెప్పవద్దు."

"మీరు వ్రాయదలుచుకున్నారా, నన్నూ, నాపిల్లల్నీ ఏగంగలోనో తోసి మరీ వ్రాయండి. అప్పుడు తండ్రీ కూతు ళ్లు సుఖంగా వుందురు గాని."

జగన్నాధం తనభార్య మిగతా సగం ఆస్తి తమపేర పెట్టవలసిందని అడుగుతుం దనుకున్నాడు గాని అరవింద పేర ఇట్లా అసలే వ్రాయవద్దని పట్టుపడుతుం దనుకోలేదు.

"ఇంత ఆలోచన లేకుండా మాట్లాడతా వనుకోలేదు. అమ్మాయికి అత్తవారివల్ల చాలా వత్తిడి కలిగింది. ఆడపిల్ల ఉసూరుమనటం మనకు మంచిదా" అన్నాడు.

ఆమాటకు ఆమెకు ఎక్కడలేని కోపమూ వచ్చింది, తనపేరును సార్థకపరుచుకున్నది. "మగబిడ్డలు ఉసూరు మనడం మీకు సంతోష మన్నమాట. ఆస్తి కూతురిపేర వ్రాయదలుచుకున్నవారు మళ్లీ ఈ జంఝాటాన్ని ఎందుకు పెట్టుకున్నారు? ఏడిస్తే వాళ్లే ఏడ్చి పోతారుగదా అనా? వీళ్లు గనక అడ్డంలేకపోతే ఆస్తంతా కూతురిపేర పెట్టుకుని తండ్రీ కూతుళ్లు సుఖంగా వుండేవాళ్లుగా?"

"............................"

"రత్నాలవంటి మగబిడ్డలను చూసి ఐనా వ్రాస్తానన టానికి మీమన స్సెలా అంగీకరించిందండీ?"

"............................"

"ఏమీ తెలియని కసికందుల్ని అన్యాయం చెయ్య టానికి మీప్రాణం ఎలా వప్పిందండీ?"

"............................"

"అటువంటివాళ్లు ఎందుకు కన్నారు?"

ఆమెకఠినవాక్యాలను ఆలకిస్తున్న జగన్నాథంశ్రవణేంద్రియంతో ఆమెలావణ్యాన్ని వీక్షిస్తున్న అతని చక్షురింద్రియం స్నేహం కలుపుకున్నది. ఆమె చిన్నగా మాట్లాడితే చిలకపలుకుల్లాగానూ, బిగ్గరగా మాట్లాడితే కోయిల కూతలాగానూ వున్నదతనికి. జగన్నాథం అంత ధనవంతుడయ్యును సౌందర్యధనంముందు అతని ధనం యేమీ పని చెయ్యలేదు. ఆమెయెదుట లక్షాధికారిముందు భిక్షాధికారిలాగా అయిపొయ్యాడు.

దుర్గమ్మ భోజనం చెయ్యకుండా గదిలో చాప పరుచుకుని పండుకున్నది. పక్కగదిలో పండవేసిన కవలపిల్లల్లో ఒక కుర్రవాడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. అరవింద ఎంత సముదాయించినా వూరుకోలేదు. తన పినతల్లిని పిలుచుక వద్దామని పినతల్లిగదిలోకి వెళ్లింది అరవింద. అరవింద వెళ్లేసరికి తనతండ్రి పిన్నిని లేవమని బ్రతిమలాడుతున్నాడు.

అరవింద అన్నది: "పిన్నీ! తమ్ముడు ఏడుస్తున్నాడు. ఎంత సముదాయించినా ఊరుకోవడంలేదు. ఏడ్చిఏడ్చి గొంతెండి పోతున్నది. లేచి పాలివ్వు".

దుర్గమ్మ కోపంతో "పోనీలేవమ్మా తల్లీ! వాళ్లకుగనక గొంతెండిపోతే అందరి కళ్లూ చల్లపడతవి," అన్నది.

తన పినతల్లికోపానికి కారణ మేమిటో అరవిందకు అర్థంకాలేదు. మారుపలక్కుండా చిన్నపుచ్చుకుని వెళ్లిపోయింది.

"ఏమి టామాటలు? అమ్మాయి ఎంత కష్టంతో వెళ్లిందో చూడు. ఇదిగో నామాట వినవుటే! ఎంత చెప్పినా అంతేనా? లేచి పిల్లవాడికి పాలిచ్చి అన్నం తిను. ఎందుకట్లా యిదిఅవుతావు" అన్నాడు జగన్నాధం.

"నాతిండిజోలి మీకెందుకు? నేను తింటేనేం, తినకపోతేనేం? ఆస్తి కూతురిపేర పెట్టుకుని మీరూ మీరూ సుఖంగా వుండండి. నేనూ, నాపిల్లలూ యెట్లా పోతే మీకెందుకు?" అంటున్నది దుర్గమ్మ.

ఆమాటలు వెళ్లిపోతున్న అరవిందకు వినిపించినవి. తన పిన్నికోపానికి కారణమేమిటో ఆమెకు బోధపడ్డది. ఆస్తివిషయంలో తన అత్తవారు తొందరపడుతున్న దెందుకో అప్పు డామెకు అర్థమయింది. ఆస్తి వ్రాయించుకుని వెళ్లటం తాను అనుకున్నంత సులభమైన పని కాదనికూడా అప్పు డామెకు తెలియవచ్చింది. ఆమెమనస్సు వికలమైపోయింది. వెళ్లి గదిలో చాప పరుచుకుని పండుకుని తన పోయినతల్లిని తలుచుకుని దుఃఖపడ్డది.

జగన్నాధం ఎంత బతిమలాడినా దుర్గమ్మ లేవకపోవడంవల్ల తానే ఏడ్చే కుఱ్ఱవాడిని ఎత్తుకుని వెళ్లి తల్లి పక్కలో పండవేశాడు. అప్పుడు రాత్రి పదిగంటలవుతుంది. జగన్నాధం అరవింద పడుకున్న గదిలోకి వెళ్లి "అమ్మా! అన్నం తిన్నావా?" అని అడిగాడు.

"లేదు నాన్నా!" అన్నది అరవింద.

"ఇంత ప్రొద్దుపోయినా నువ్వెందుకు తినలేదు తల్లీ?"

"నా కాకలిగా లేదు నాన్నా".

"ఆకలి లేకపోవట మేమిటమ్మా? లేచి ఆకలి ఐనవరకే తిను తల్లీ!"

అరవింద పండుకున్నదల్లా లేచికూర్చుని "పిన్ని అలిగి పండుకున్న దెందుకు నాన్నా?" అన్నది.

"అది నామీది కోపంలే తల్లీ!"

"మన ఇద్దరిమీది కోపం నాన్నా. యిందాకా పిన్ని నీతో అంటున్న మాటలు నాకు వినిపించినవి. వ్రాస్తానన్నందుకు నీమీదా, వ్రాయమన్నందుకు నామీదా."

"నీమీద దానికి కోపం వుండదు తల్లీ!"

"ఇందాకా నేను వస్తే యెలా విదిలించివేసిందో విన్నావుగా నాన్నా?"

"అదీ నామీది కోపమే తల్లీ! మీపిన్ని వట్టి వెఱ్రిబాగులది. తెలియని మూర్ఖం!"

"తప్పకుండా వ్రాయించుకుని వస్తానని వారిని నమ్మించి వచ్చాను నాన్నా!"

"మీపిన్ని వట్టి బోళామనిషి తల్లీ! మంచికి దానంత మనిషి లేదు. దాన్ని సమాధానపరిచి వ్రాసివేస్తాను. నువ్వేమీ విచారించక లేచి భోజనం చెయ్యి తల్లీ!"

అరవిందకు భోజనంచెయ్యాలని మనస్సులేనందున తండ్రికి ఏదో సమాధానం చెప్పి పంపింది.

కాలుగాలిన పిల్లిలాగా జగన్నాధం మళ్లీ భార్య పడుకున్న గదిలోకి వెళ్లాడు. భోజనం చెయ్యకుండానే దుర్గమ్మ పిల్లలను పక్కలో వేసుకుని నిద్రపోతున్నది. ఆమెపొట్ట వెన్నుకంటుకునివున్నది. జగన్నాధాని కెంతో జాలివేసింది. తానుతిన్న అన్నంకూడా నీరైపోయింది.

౭

ఆతెల్లవారి సూర్యోదయం కాక ముందే దుర్గమ్మ లక్షణంగా భోజనం చేసి యథాస్థానాన్ని అలంకరించింది. భార్య భోజనం చేస్తూవుండగా జగన్నాధం చూసి చాలా

సంతోషించాడు. తన ఆకలి చల్లారినట్టుగా వున్న దతనికి. అరవిందకు మనస్సు స్తిమితంగా లేదు. అదివరకు ఎప్పుడు చూసినా ఆమెచేతులో తమ్ముడుగాని, లేక పుస్తకంగాని వుండేది. ఆవేళ ఆమె ఏమీ ముట్టుకోలేదు. తండ్రి చెప్పగాలేచి భోజనంమాత్రం చేసింది. జగన్నాధం భార్యను ఒకటి రెండు సార్లు పలకరించబోయాడుగాని ఆమె సరీగా మాట్లాడలేదు.

ఆసాయంత్రం "అక్కయ్యా!" అంటూ దుర్గమ్మ తమ్ముడు వచ్చాడు. దుర్గమ్మ సంతోషంగా తనతమ్ముడితో ఏవో మాట్లాడి తమ్ముడు వెళ్లుతూవుంటే అతనితో వీధి వాకిలిదాకా వెళ్లింది. దుర్గమ్మ ప్రొద్దుటినించీ పక్క వదిలి పెట్టనిదల్లా స్థానం విడిచి అప్పుడు వీధివాకిట్లోకి వెళ్లడం, ఆమెముఖం సంతోషంగా వుండడం ఈశుభలక్షణాలు చూస్తే జగన్నాథానికి ఎంతో సంతోషం అయింది. త్వరగా ఇంట్లోకి వెళ్లి తాటాకులబుట్టనిండా కలకత్తాజామపండ్లు వేసుకుని వీధివాకిట్లోకి పట్టుకువెళ్లి తన బావమరదితో ఛలోక్తిగా "ఒరే బావా! మీ అక్కకోపాన్ని మోసుకెళుతున్నావుకదూ, ఊతగా ఇవిగూడా మోసుకెళ్లు" అంటూ బుట్ట అతని బుజం మీద పెట్టాడు.

దీపాలు వెలిగించాక జగన్నాథం భార్యగదిలోకి వెళ్లి "మీతమ్ముడికి పిల్ల కుదిరినట్టేనా?" అని భార్యతో సంభాషణ మొదలువేశాడు.

"అంతా ఎరగనట్టు అడుగుతారు; మీకు తెలియందే కుదురుతుందాఏమిటి పిల్ల!"

"చూడు. పిల్లకు వస్తువులేవో వాళ్లు పెట్టుకుంటే తతిమ్మాఖర్చులన్నీ మనం భరించి పెండ్లిచేసివేద్దాం. మన వాళ్లకు మనం ఆదుకోకపోతే యెట్లా?"

క్షణం ఆగి జగన్నాథం అన్నాడు: "అమ్మాయి ఎంత దిగులువేసుకుందో చూశావుకదూ?"

అరవిందమాట తెచ్చేసరికి మళ్లీ పుట్టెడుకోపం ఆమెమీదకు దొర్లింది. "ఇంకేం, దిగులు తీర్చండి." అని విసురుగా అన్నది.

"మన బిడ్డదిగులు మనం కాకపోతే ఎవరు తీరుస్తారు మరి?"

దుర్గమ్మముఖం ఎఱ్ఱపడ్డది. "అయితే మీ వుద్దేశం ఆస్తి వ్రాసివెయ్యాలనే నన్నమాట ? ఎవరితరపువాళ్లమీద వాళ్లకు ప్రేమ. ఎవరికీ పట్టనిబిడ్డ వెక్కివెక్కి ఏడ్చాడుట ! యీ పాడు పిల్లలు ఎవరు పుట్టమని యేడ్చారు ? పుట్టక పోయినా యీగోలంతా లేకపోను. ఆస్తి నా కేమన్నా కావాలని అఘోరిస్తున్నాను గనకనా ? మేమంటే మీ కంత ఇష్టం లేకపోతే నన్నూ నాపిల్లల్నీ మాపుట్టింటికి పంపివెయ్యండి."

"మనసు కనిపెట్టకుండా అట్లా తొందరపడి మాట్లాడితే యెట్లా ? నాకు భేదం ఎంతమాత్రం లేదు. ఉభయులూ నాకు సమానులే. నువ్వు భేదంగా మాట్లాడుతూ పైగా నన్నంటావు. నీబిడ్డ అయితే వొకటీ, నీ సవతిబిడ్డ అయితే వొకటీనా ?"

దుర్గమ్మ ఆవేశంతో అన్నది: "మీ తప్పు మీరు తెలుసుకోలేకుండా పైగా నన్నంటున్నారా? ఉభయులూ సమానం అనటంలోనే కనపడుతున్నది మీ భేదబుద్ధి. సిసలుగా మగపిల్లలకు చెందవలసిన ఆస్తిని అంతాగాని కొంతగాని ఉభయులూ నాకు సమానులే అంటూ ఆడపిల్లకు వ్రాస్తానటం అటువైపు మమకారం కాకపోతే మరేమిటి ? ఆడపిల్ల అయినందుకు వచ్చి నెల్లాళ్లు వుండి తినమనండి. సారెలూ చీరెలూ యివ్వండి. అంతవరకే ఆడపిల్లకు పుట్టింటిలోని హక్కు. మీ రొక వందరూపాయల చీర తెచ్చి ఆమెకు పెడతానంటే నేను వద్దన్నప్పుడనండి నాది భేదబుద్ధని."

జగన్నాథం నిలవతొక్కుకుని అన్నాడు: "నువ్వు చెప్పేది సామాన్యంగా లోకంలో జరిగే విషయంగాని అమ్మాయికి అది వర్తించదు, నిన్ను చేసుకోకపూర్వం ఎప్పుడో జరిగినమాటలుకాని యిప్పటివి కావు. అన్నమాటను ఏస్థితిలోనైనా జరిగించటం ధర్మమేగా?"

"అయితే మగబిడ్డల్ని మోసంచెయ్యటం మీకు ధర్మమన్నమాట?"

"సంగతి గ్రహించుకోకుండా భర్తను ఎదిరించి మాట్లాడటం ఆడదానికి తగునా? మూర్ఖం వదిలి కాస్త మంచిదాని వనిపించుకో."

ఆమాటకు దుర్గమ్మకోపం విజృంభించి ఏడుపుగా మారింది. "మంచిదాన్ని కాకపోవటానికి నేనేమన్నా బజార్లు పట్టుకుని తిరుగుతున్నానా? నేనేమన్నా అందర్నీ నోటికివచ్చినట్లల్లా కూస్తున్నానా? పిల్లల గొంతు కోయటానికి నేనూ తయారైనట్టయితే మంచిదాన్నే! బిడ్డలు తండ్రికే విరోధులౌతారని యెన్నడైనా అనుకున్నానా? పిల్లలిట్లా దిక్కూదివాణం లేనివాళ్లయిపోతారని కలలోనైనా అనుకుని యెరుగున్నానా? యెవరికీ గిట్టనప్పుడు యిక్కడ మేమింకా వుండి దేనికి?"

భార్య సరాగాలు తీస్తున్నది. జగన్నాధం లేచివెళ్లి హాల్లో కుర్చీలో కూలబడ్డాడు. వ్రాద్దామంటే భార్యపోరు;

వ్రాయకపోతే కూతురి గోడు! వెనుక నుయ్యి. ముందు గొయ్యి! దారీ తెన్నూ తెలియక అయోమయంలో పడిపోయ్యా డతడు.

ఆరాత్రి ఎవరూ భోజనాలు చెయ్యలేదు. అరవింద తనతండ్రికీ పినతల్లికీ జరిగిన ఘర్షణ విన్నది. ఆమె ఇంత గొడవ జరుగుతుం దనుకోలేదు. ఆమె హృదయం అతికోమలమైనది. తన విషయమై తాను పడుతూ వున్న చింతకాక తననుగురించి తన తండ్రి పడుతూ వున్న మనస్తాపంకూడా ఆమెరెండోచింతకు కారణ మైంది. ఆరాత్రి తండ్రి భోజనం చెయ్యకపొయ్యేసరికి ఆమెహృదయం ఎంతో బాధపడ్డది. తన తండ్రి పిన్ని అంగీకారం లేకుండా వ్రాయడని ఆమె తెలుసుకున్నది. చూస్తే పిన్ని వొప్పుకునేటట్లు ఆమెకు కనపడలేదు. ఇప్పటికే ఏడుపులూ పస్తులూదాకా వచ్చింది. ఇంకా తన తండ్రి పిన్ని అంగీకారంకోసం ప్రయత్నిస్తే రభస పెరిగిపోవటంతప్ప ప్రయోజనం వుండదు. వ్రాసేదిలేకపోగా అనవసరంగా వాళ్లకూ వాళ్లకూ రభస పెరిగి మళ్లీ నిలవపెట్టుకున్న ఆయనసంసారం చిందుచిందుకావడం దేనికి? తన తండ్రిని మందలించాలని అరవింద ఆరాత్రి ఆలోచించుకున్నది.

తెల్లవారి తన తండ్రి ఇంట్లో ఏకాంతంగా కూర్చుని వుండగా అరవింద వెళ్లి "నాన్నా! ప్రస్తుతం యీవిషయం ఇక పిన్నిదగ్గర తేవద్దు. ఆగవలసిందని వాళ్ళకు నేను యేదో విధంగా నచ్చచెబుతాను" అన్నది.

ఆమాటలు జగన్నాథానికి ప్రవాహంలో పడి కొట్టుకెళుతున్నవాడికి పూతలాగా పనిచేసినవి. కుమార్తె ఉచితజ్ఞతకు ఎంతో ఆనందించాడు. ఆమర్నాడే అరవింద ప్రయాణమై అత్తవారింటికి వెళ్లిపోయింది.

౨

ఆరోజుసాయంత్రం ఆఫీసునుండి ఇంటికి వచ్చిన జనార్దనస్వామి పుట్టింటివద్దనుండివచ్చిన భార్యను చూసి ఆమెను యింట్లోకి పిలిచి "నువ్వు వెళ్లిన పని ఏం చేసుక వచ్చావు?" అని అడిగాడు.

"మా నాన్న ఏమీ అడ్డుచెప్పలేదు. వ్రాస్తానన్నాడండి"

"వ్రాశాడా మరి?"

"యిప్పుడే వ్రాయటానికి ఆయన పూర్ణంగా వప్పుకున్నాడు కాని—"

జనార్దనస్వామి మధ్యలో అందుకున్నాడు: "ఏమిటీ కానీ? మళ్లీ యేమన్నా పానకంలో పుడక పడ్డదా యేమిటి?"

"మరేమీ లేదండీ, కొంచెం ఆలస్యం. అంతే."

"పొడుగూనా వొకటే ఆలస్యం. వ్రాయడానికి ఆయన పూర్ణంగా అంగీకరించా డని గదా చెపుతుంటివి. ఆయన అంగీకరించినప్పుడు యింకా ఆలస్యం దేనికి?"

"మా పిన్నిని కాస్త వప్పించవలసివచ్చింది."

"అట్లాచెప్పు. మీనాన్నకు కొత్తపెళ్లాం సలహా తీసుకుంటేనే గాని ఏపనీ చెయ్యలేనంతటి అవస్థ పట్టిం దన్న మాట!"

"అబ్బే! అట్లా అంటారేమండీ? యీ విషయం మా నాన్న ఆమెకు చెప్పే అవసరమే లేదు."

"చెప్పే అవసరమే లేనప్పుడు ఆమెను ఒప్పించే అవసర మెందు కొచ్చింది?"

"మేము అనుకునే మాటలను ఆమె విన్నది."

"అదా సంగతి? పసిపట్టి మీరనుకునే మాటలను విని వ్రాయవద్దని పేచీపెట్టుకుని కూర్చున్నదన్న మాట. యిప్పుడు నా కంతా అర్థమైంది. ఆస్తి ఎక్కడ కూతురిపేర వ్రాస్తాడో అని మొగుణ్ణి వెయ్యికళ్లతో కనిపెడుతూవున్నదన్న మాట. అయితే కథ చాలా లోతుకు వెళ్లిందన్న మాటే" అని జనార్ధనస్వామి నిట్టూర్పు విడిచాడు.

"ఏదో ఆడవాళ్లగోల ఎరగరూ? మాపిన్ని ముందు కాదన్నా తర్వాత వొప్పుకోకపోదు."

"అసలు వొకళ్లను వొప్పించేదేమిటి? వ్రాసివేస్తే తొత్తుఖానా ఏంచేస్తుంది? మీనాన్న కసలు మనస్ఫూర్తిగా వ్రాయాలని వుంటేగా?"

"అట్లనకండి. మానాన్న వ్రాయలేక కాదు. ఇంట్లో గుల్లకలతలు యెందుకని ఆమెను వప్పించే వ్రాయాలని చూస్తున్నాడు. మనం వాళ్ల కష్టనిష్ఠూరాలుకూడా పారచూసి కొంత ఆలస్యానికి సహించుకోవాలి".

జనార్దనస్వామి కోపంతో "ఆవిడ వొప్పుకుని మీ నాన్న వ్రాస్తాడని నీ కంత నమ్మకం వుంటే అందాకా అక్కడనే వుండి వ్రాయించుకుని రాలేకపొయ్యావూ? యిక్కడ ఏం మునుకు పోయిందని వచ్చావు?" అన్నాడు.

ఆమాటకు అరవిందకళ్లల్లో నీళ్లు తిరిగినవి. "మీరు వుండగలిగినా మిమ్మల్ని విడిచి నేనుమాత్రం వుండలేను"

వెంకటనారాయణా, అతనిభార్యా కొడుకువల్ల సంగతీ సందర్భం తెలుసుకున్నారు. వెంకటనారాయణ నిరాశతో మంచులాగా గడ్డకట్టుకుపొయ్యాడు. ఆయనభార్య ఉద్వేగంతో పరవళ్లు తీసింది. "ఆగమంటే యెందాకని ఆగుతారు? చెప్పే

వాళ్లకై నా వుండాలి, వినేవాళ్లకై నా వుండాలి. యిప్పుడు పెళ్లాం వంక వకటి దొరికింది. ఎగవెయ్యడానికి యెన్ని సాకులయినా తెచ్చిపెట్టుకుని యెట్లాగైనా కాలం గడుపుకోవచ్చు. యింత దగా యెక్కడైనా వున్నదా? అంతా మీకేనని అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టు మాటలు చెపితే నిజమేకామాలని కానీ కట్నం పుచ్చుకోకుండా పిల్లను పుచ్చుకుంటే ఆఖరుకు యీవిధంగానా మాట్లాడేది? పెద్దమనిషి కిది తగునా? చిక్కిన తగువా చిక్కని తగువా అన్నారు. వేలకివేలు కట్నం పిల్లవాడి కాళ్లదగ్గిర పోస్తామని ఎంతోమంది వస్తే వాళ్లనూ వదులుకుంటిమి. ఎకరాలకు ఎకరాలు మాగాణి లగ్నకాల మందు చదివిస్తామని ఎంతోమంది బతిమలాడితే వాళ్లనూ మానుకుంటిమి. మంచికి మంచి యెక్కడైనా వున్నదా? వాళ్లను ముందు యేవిధంగా నమ్మించి దించామూ అన్న గుర్తుండవద్దూ? పని గడిచినతర్వాత గడిచిన మాటలు! యేదో మర్యాదస్థులూ, సాంప్రదాయీకులూ అనుకున్నాము గాని యిలా రెండోమాటకు వస్తా రనుకోలేదు. నలుగుర్లోకి వచ్చేపొయ్యేవాడుగదా యిట్లా చెయ్యడం అతనికి తగునా?"

అత్తగారి విసుర్లు విని అరవింద కన్నవాళ్లను తిట్టించేటందుకు పుట్టానుకామాలని తనను తాను నిందించుకుని వూరుకున్నది.

అరవింద పూర్వం వాళ్ల దృష్టిలో పిల్లజమీందారిణి. యిప్పుడు ఆస్తీ పాస్తీ లేని సామాన్యనికృష్టపుత్రీ, అరవింద వాళ్ల చేత పూర్వం ఎంత గౌరవంగా చూడబడిందో యిప్పుడు వాళ్ల కంత గిట్టనిదై పోయింది. అత్తగారు ప్రతిపని వద్దా రుంజుకోవడం, సూటీపోటీమాట లనడం, మూతివిరుపులూ ముక్కువిరుపులూ ప్రారంభమైనవి. భర్త ఆమెతో మాట్లాడ్డం మానివేశాడు. అరవిందకు అరణ్యంలో వున్నట్టుగా వున్నది. ఆమెహృదయవేదన చెప్పటానికి అలవికాదు.

ఆరోజు జనార్దనస్వామి చీకటిపడగానే యింటికి వచ్చి తొమ్మిది కొట్టేటప్పటికల్లా భోజనం చేసి పడుకున్నాడు. అరవింద భోజనం చెయ్యకుండానే భర్త పడుకున్న మంచం దగ్గిరికివెళ్లి "మీరు నాతో మాట్లాడడంలేదు. నామీదకోపానికి నే నేం చేశాను చెప్పండి?" అన్నది వినయంగా. అతడు జవాబు చెప్పలేదు.

"చూడండి. ఆయన తప్పక వ్రాసితీరతాడు. ఒకవేళ మీరనుకున్నట్టు వ్రాయకపోతాడా. పోనివ్వండి. వాళ్ల మాట వాళ్లకే వుంటుంది. వాళ్లు వ్రాసియివ్వనంత మాత్రాన మనంతట మనం బతకలేకపోము. యెందుకు నామీద కోపం చెప్పండి ?"

ఆమాటలకు జనార్దనస్వామికి ఉక్రోషం ఎత్తుకుని వచ్చింది. "యిట్లా నాటకం ఆడి మమ్మల్ని కాస్తా బుట్టలో వేసుకోమని మీతండ్రి నేర్పిపంపా డన్నమాట? యీమాటలేమీ యిక్కడ చెల్లవు. వెళ్లి ఆస్తితో మాగడప తొక్కు"

ఆమాటకు తలమీద పిడుగు పడ్డట్టయింది అరవిందకు. అప్రయత్నంగా ఆమెకళ్లవెంట రెండు నీటిబిందువులు జారి భూమిమీద పడ్డవి.

"నేను ఏమాట మాట్లాడినా మీకు తప్పుగానే వున్నది. మీరు కోపంగా వుంటూవుండబట్టి ఆయన వ్రాయకపోతే మనంతట మనం బతకలేమా, కోపంగా ఎందుకుంటారు అన్నాను. యిందులో నా కాయన నేర్పిపంపిం దేమిటండీ నాబొంద? నన్ను ఆస్తితో గడపతొక్కమంటున్నారు. మీ మనస్సు యింత కఠినమైందని నేనెన్నడూ అనుకోలేదు. ఆభారం నామీద వెయ్యడానికి మీరూ మీరూ ముందు ఏమి మాట్లాడుకున్నదీ నేనేమన్నా ఎరుగుదునటండీ? మధ్య నన్ను బాధించటం న్యాయమేనా? మీతో చెప్పినప్రకారం వెళ్లి ఆయనను అడిగి వ్రాయించుకోండి."

"అంతేనా? మేము అడగవలసిందేకాని నీకేమీ పని లేదన్నమాట. ఔను. నువ్వుగనక అడిగితే నీమాట తీసి వెయ్యలేక ఆస్తి ఎక్కడ వ్రాసివేసి మీతండ్రి నష్టపడి పోతాడో అన్న భయం నిన్ను పీడిస్తూవుంటే ఎందు కడుగుతావు?"

"అయ్యో! యెట్లాగండీ? నే నెందుకు అడగను? మొన్న వెళ్లి అడిగివస్తినిగదండీ. మీరు ఆస్తితో గడప తొక్కమంటూవుంటే అంత భారం నామీ దెందుకు వేస్తారు, మీరు వెళ్లి అడగండి అన్నానుగాని".

"నువ్వు అడగటం చెప్పనా, మాకళ్లనీళ్లు తుడిచేటందుకు వెళ్లి అడిగావు. మీరు మాఅలుసు బాగా కనుక్కున్నారు. మీతండ్రి మాలో సత్తా తెలుసుకుని వాళ్లేం చేస్తారని మమ్మల్ని చెవులుపట్టుకుని ఆడిస్తున్నాడు. యివతలవాళ్లు ఎంత పిచ్చివాళ్లయినా మిమ్మల్ని చూసిఐనా నేర్చుకోరూ? యీదెబ్బతో అన్నీ తేలతవి."

తాను ఏది మాట్లాడినా భర్తకు తప్పుగా కనబడుతున్నందున అరవింద యిక ఏమీ మాట్లాడలేదు. తన పుట్టింటివద్ద పరిస్థితులు అనుకూలంగా లేవు. యిక్కడ పరిస్థితులు చూస్తే యిట్లా విషమించినవి. ఆమెస్థితి కత్తినాగలి సందున చిక్కుకున్నట్లయింది. ఆరాత్రి అరవింద నిద్రపోలేదు.

వాళ్ల కోపతాపాలముందు వుండటం అరవిందకు బుసలుకొట్టే సర్పాల మధ్య నివసిస్తున్నట్టుగా వున్నది. అందలం ఎక్కినవాళ్ల అందలం మొయ్యడం కష్టం. అయినా ఎంతో ఓర్పుమీద అట్లాగే కొన్నిరోజులు గడిపింది.

ఆరోజుఉదయం భర్త ఆఫీసుకు వెళ్లడానికి ఇంట్లో బట్టలు వేసుకుంటూవుండగా అరవింద వెళ్లి "నేను వుండటం మీ కంత కష్టంగా వుంటే నన్ను మాపుట్టింటికి పంపివెయ్యండి" అన్నది.

"రోగీ పాలే కోరాడు, వైద్యుడూ పాలే చెప్పాడు" అంటూ జనార్దనస్వామి తండ్రిని పిలిచి "పుట్టింటికి వెళ్లతుందట. వెళ్లి దిగవిడిచి ర"మ్మని చెప్పాడు. వెంకటనారాయణ బండికోసం వెళ్లాడు.

జనార్దనస్వామి బట్టలు వేసుకుని వెళ్లిపోవడానికి సిద్ధం అయ్యాడు. అప్పుడు అరవింద దుఃఖస్వరంతో "వెళ్లి వస్తాను. యీదీనురాలిమీద దయమాత్రం వుంచండి"అంటూ వంగి భర్తరెండుపాదాలనూ కళ్లకద్దుకుని కన్నీటితో భర్తకు పాదాభిషేకం చేసింది.

"దీనురాల వనుకుంటానికి నీకేం ఖర్మం! లక్షాధికారి ముద్దులకూతురి వైతే" అని జనార్దనస్వామి నోట్లో నోట్లో గొణుక్కుంటూ వెళ్లిపొయ్యాడు. అరవిందకు ఆయింట్లో ప్రియమైన రెండోవస్తువు ఆవువొకటి. ఆఆవు వాళ్ల పుట్టింటి వాళ్ల తోలిపెట్టినది. అదంటే ఆమె కెంతో ప్రాణం. పెరట్లో కట్టివేసివున్న ఆవుదగ్గరకి వెళ్లింది అరవింద. ఏలాటి చీకూ చింతా లేకుండా మానవులకు లభ్యంకాని అనిర్వచనీయమైన ఆనందసుఖాన్ని అనుభవిస్తూ నెమరువేస్తున్న దా మౌనమూర్తి. "తల్లీ, నిన్ను వదిలిపెట్టిపోతున్నాను. మళ్లీ నిన్నెప్పటికి చూస్తానో" అంటూ కన్నీళ్లతో ఆవుశిరస్సును తడిపివేసింది.

ఇంతలో గుర్రబ్బండి వచ్చి వాకిటిముందు ఆగింది. బండివాడు అరవిందపెట్టెబేడా బండిలో పెట్టాడు. అరవిందా, వెంకటనారాయణా బండియెక్కి రైలుస్టేషనుకు వెళ్లిపొయ్యారు.

౬

రైలు గోవర్ధనపురంస్టేషనులో ఆగింది. అరవింద, వెంకటనారాయణ బండిదిగారు. వెంకటనారాయణ ఒంటెద్దు బండి మాట్లాడగా అరవింద బండిలో యెక్కింది. స్టేషనుకూ, ఊరుకూ నాలుగు ఫర్లాంగుల దూరం. బండి ముందు వెళ్లుతూ వుండగా బండివెనక వెంకటనారాయణ నడుస్తున్నాడు. బండి వూరు సమీపించి గల్లీ తిరిగేటప్పటికల్లా బండివెంటవస్తున్న వెంకటనారాయణ వెనకవెనకనే మాయమయ్యాడు. బండి అరవిందపుట్టింటి ముందు ఆగింది. బండి వాకిటిముందు నిలవగానే ఇంట్లోనించి జగన్నాథంపెద్దకొడుకు సంతోషంతో గంతులువేసుకుంటూ బండిదగ్గిరికి వచ్చాడు. అరవింద బండి దిగగానే ఆకుఱ్ఱవాడు అరవిందను కా[illegible]సుకున్నాడు. అరవిందకు ఆ కుఱ్ఱవాడు ఎంతో మాలెం. అరవింద పుట్టింటి వద్ద వున్నన్నాళ్లూ ఆకుఱ్ఱవాడు తల్లిదగ్గిరికైనా పోడు. "ఒరేః చంద్రం! మీ అక్కయ్యను తీసుకవెళ్లడానికి యెదురు వచ్చావుట్రా?" అంటూ అరవింద వాడిని చంకనవేసుకుని ఇంట్లోకి వెళ్లింది.

ఇంటి చివరిగుమ్మంవద్ద వున్న దుర్గమ్మ అరవింద వీధిద్వారంవద్ద వుండగానే చూసి ముఖం చిట్లించుకుని "దోచుకుంటానికి వస్తున్నది" అని మనసులో అనుకుని చూడనట్టు వెంటనే ముఖం తిప్పుకుని అవతలకు వెళ్లిపోయింది. అరవింద ఇంట్లో కాలుపెట్టగానే ముందు పనిమనిషి కోటిలింగ కనిపించింది. అరవిందముఖంలో పూర్వపు ఆనందం, పూర్వపు కళ లేవు. తల దువ్వుకోనందున ఆమె జుట్టు రేగివున్నది. ప్రయాణం చేసేటప్పుడు కట్టుకునే చీరకాకుండా మామూలుచీరే కట్టుకొనివున్నది. పూర్వం ఆమెను ఒకసారి చూచినవాళ్లకుసైతం ఆమెలోని మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. కోటిలింగ బిందె పుచ్చుకుని నీళ్లు తేవడానికి వెళ్లుతున్నదల్లా అరవిందను చూచి ఆగి గడ్డంమీద చెయ్యి వేసుకుని "అట్లా వున్నావేమ్ అరవిందమ్మగోరూ? యిదేనా రావటం? జరం తగులుతున్న దేంటమ్మా అట్లా వున్నావు" అన్నది,

"అవును కోటిలింగా! వంట్లో బాగుండటంలేదు. సరే కాని మానాన్న కనిపించలేదు, తోటకుగాని వెళ్లాడా?"

"తోటకు కాదమ్మా. నిన్ననంగా గుంటూరు వెళ్లారు. ఇంకా రాలేదు. తమ్మయ్య అప్పిడే సంక యెక్కాడు. పిల్లలంటే నీకెంత పానం? దేవుడు నీకింకా వడికట్టలేదు" అన్నది కోటిలింగ విచారాన్ని సూచించే ముఖం పెట్టి.

"మా పిన్ని కనపడలేదు, యింట్లోగాని వున్నదా?"

"మీపిన్నమ్మ యింట్లోనే వున్నదమ్మా. గదిలో యేదో చేస్తున్నది"

అరవింద దుర్గమ్మ వున్న గదిలోకి వెళ్లింది. దుర్గమ్మ కాస్త దూరంలో వుండగానే అరవిందచంకలో సంతోషంతో పొంగిపోతున్న చంద్రం తల్లిని చూడగానే "అమ్మోయ్!

అక్కయ్య వచ్చిందేవ్" అని కేకపెట్టాడు. పెట్టె తెరచి చీరలు లెఖ్ఖపెట్టుకుంటూవున్న దుర్గమ్మ కుర్రవాడు అన్న మాటలు వినపడనట్లు తలతిప్పిఅయినా చూడకుండా యిస్త్రీ మడతలు తిరుగా బోర్లా వేస్తున్నది. అరవింద ఆమె దగ్గిరికి వెళ్లి "పిన్నీ ! ఏం చేస్తున్నావు ?" అన్నది.

దుర్గమ్మ అప్పుడు తలయెత్తిచూసి "యెప్పుడొచ్చావమ్మా?" అన్నది. అరవిందను పలకరించడం తప్పనిసరి అయినందున దుర్గమ్మగొంతును పెకలించుకుని వచ్చింది ఆకాస్తమాటా.

"యిప్పుడే పిన్నీ. నాన్న గుంటూరు వెళ్లాడుటగదూ"

"కోర్టుపని వుండి నిన్ననంగా వెళ్లారు. నిన్ననే తిరిగి వస్తానని రాలేదు. యివాళ రావాలి" అన్నది దుర్గమ్మ పెద మొఖం పెట్టి.

జగన్నాధం ఆరోజుసాయంత్రానికి ఇంటికి తిరిగి వచ్చాడు. అరవిందను చూసి "యెప్పుడొచ్చావమ్మా" అన్నాడు బిగువెక్కిన గుండెతో.

"మధ్యాన్నం వచ్చాను, నాన్నా"

"మరీ అట్లావున్నావేమమ్మా, అక్కడి విశేషాలేమిటి?"

"విశేషాలేమీ లేవు నాన్నా. నాలుగురోజులు వుండి పోదామని వచ్చాను"

"చెపితే బాధపడతానని దాస్తున్నావా తల్లీ? మీపక్కయింటి కృష్ణమూర్తి నాకు గుంటూరులో కనపడి అంతా చెప్పాడు. మీఅత్త నిన్ను రంపానరాస్తున్నదటగా? ఇంట్లో ఎవ్వరూ నీతో సరీగా మాట్లాడ్డం లేదటగా? ఒకనాడు కృష్ణమూర్తి వాళ్ల దొడ్డిగుమ్మంవద్ద నిలుచుంటే నువ్వు ఆవుకు కుడితిపెడుతూ కళ్లనీళ్లు పెట్టుకుంటున్నావట. అతను అంతా నాకు చెప్పాడు. ఎవ్వరో చెప్పడం దేనికి? నిన్ను వాళ్లు వేపుకుతింటున్నట్టు నీ వునికే చెపుతున్నది. ఎలా వుండేదానివి ఎలా అయిపొయ్యావు తల్లీ."

జగన్నాధం అంతలో వుగ్రుడై "వాళ్లు వట్టిమూర్ఖులు. ఎడ్డెమంటే తెడ్డెమనేరకం. వాళ్ల అత్రు వంగిందాకా యిక నువ్వు వాళ్ల గడప తొక్కవద్దు. ఇక్కడ నీకేం తక్కువ తల్లీ? నువ్వొ ఒక మగబిడ్డ వనుకుంటాను" అని జగన్నాధం అక్కడనుంచి వెళ్లిపొయ్యాడు.

అరవిందను చూస్తే దుర్గమ్మ ఎప్పుడూ కొరకొరలాడుతూవుంటుంది. అరవింద పిలిస్తే దుర్గమ్మ పలకటమే కష్టం. అరవింద వొకపూట తింటే వొకపూట తినదు. ఆమె హృదయం దుఃఖాతిరేకంచేత లోలోపల కుమిలిపోతున్నది. ఆమె ఏకాంతంగా కంట తడిపెట్టని రోజు లేదు. ఆమెశరీరం రోజురోజుకూ కృశించిపోతున్నది. ఆమెజీవితం దుఃఖమయం అయిపోయింది.

ఒకరోజున నలుగురైదుగురు కుంటీ, గుడ్డివాళ్లు కలిసి దీనంగా పాడుకుంటూ వాకిటిముందుకు వస్తే అరవింద వాళ్లకు దోసెడు వడ్లు వేసింది. తన గదిలో నిలువుటద్దం ముందు నిలుచుని తలకు సువాసననూనె రాచుకుంటూవున్న దుర్గమ్మ అరవింద ఇంట్లోనుంచి వడ్లు పట్టుకవెళ్లడం చూసి చిఱ్ఱుబుస్సులాడుతూ "ఈ ఇంట్లో అందరివీ పెత్తనాలే. వచ్చిన వాళ్లు వచ్చినట్టు. వూరుకోరు, కాసినా కూసినా, అమ్మయ్యో! ఎన్ని వడ్లు? యెన్ని వేసినా వాళ్ల సొమ్మేమన్నా పోతుంది గనకనా?..........." అని ఏవేవో అంటూవుండగా అరవింద విన్నది. అసలే చింతతో కృశించిపోతున్న ఆమెహృదయానికి ఆమాటలు శూలాలవలె నాటి ఎంతో బాధకలిగించినవి. "పుట్టినింటివాళ్లకు వున్న సిరీ సంపదా, ఇల్లూ వాకిలీ అంతా తనదేననుకుని అమాయకపుటానందంతో పెరిగి పెద అయిన ఆడబిడ్డ తీరా పుట్టిల్లు వదిలి అత్తవారింట్లో అడుగు పెట్టగానే పరాయిదైపోతుంది. పుట్టింట్లో పూచికపుల్ల సయితం ముట్టుకునేటందుకు తనకు హక్కు లేదు. ఆస్తిమీది హక్కు తనతో సమంగా రక్తాన్ని పంచుకవచ్చిన పురుషులకు. ఇంటిలోని పెత్తనం మధ్యవచ్చిన స్త్రీలకు. ఇక తాను నోచుకున్నది పూటమెతుకులకుమాత్రం. ఆడబిడ్డ చేసిన ఘోరపాపం ఏమిటి?" అని అరవింద చాలా దుఃఖపడ్డది.

అరవిందచింత, దుర్గమ్మయీర్ష్య రోజు రోజుకూ పెరిగిపోతున్నవి. పక్షంరోజులు వాటంతట అవి వెళ్లిపోయినవి. దుర్గమ్మ పీటమీద పెట్టి పిల్లిమీద పెట్టి అరవిందను సూటిపోటిమాటలనడం మొదలుపెట్టింది. అరవిందకు అవి ఎంతో బాధాకరంగా వున్నవి. ఆమె ఒకళ్లచేత అనిపించుకునిగాని, ఒకళ్లను అనిగాని ఎరగదు. అందులో ఆమె పడుతూవున్న తీరని మనోవ్యధగాక పైగా యీమాటలు ఒకటి. ఆమెకు శగలుచిమ్మే అగ్నిగుండంమధ్య నివసిస్తున్నట్టుగా వున్నది. పుట్టిల్లని వస్తే యిక్కడా ఆమెకు శాంతి లేదు.

ఆరోజు వుదయం దుర్గమ్మ నడవలో పోసివున్న జొన్నలను చూసి "ఈగొడ్లగింజలు నిన్ననంగా యిక్కడ పోసినవి యెవరికీ కనిపించనేలా ? ఎలుకలూ పందికొక్కులూ యెన్ని తినివేసినయ్యో. అవి యెట్లా తగులబడిపోతే యెవరికేం పట్టింది ? పడిదగ్గర లెక్కకు చాలామంది కనపడ

తారుగాని పనిదగ్గర ఒక్కళ్లూ కనపడరు. అవతలపుల్ల యివ తల పెట్టకపోతే తేరగా తినేందుకు ఎక్కడనించి వస్తుంది? కోటిలింగా! ఎక్కడ దూకావు, యీగింజలు నీకు కనపడ లేదా" అంటూ నాలుగు విసుర్లు విసిరింది.

దాపులో దంతధావనం చేస్తూవున్న అరవింద దుర్గమ్మ అన్న మాటలను విన్నది. అన్నది తననేనని ఆమెకు తెలు సు. "తేరగా తింటున్నదీ యెవరమ్మా" అని దుర్గమ్మను అడుగుదా మనుకున్నదిగాని ఆమెతో వాగ్వాదానికి దిగే తాహతు లేకపోవడంవల్ల ఏమీ మాట్లాడకుండా యింట్లోకి వెళ్లిపోయింది. దుర్గమ్మ విసిరిన మాటల తుపానుకు ఆమె లో స్తంభించివున్న దుఃఖకెరటాలు పొంగి ఆమెను ముంచి వేసినవి. కన్నీళ్ళతో ఆమెగుడ్డలన్నీ తడిసిపోయినవి.

అప్పుడు మధ్యాన్నం రెండుగంటలవుతుంది. జగన్నా థం అరవింద వున్న గదిలోకి వచ్చాడు. భోజనమైనా చెయ్య కుండా అరవింద అప్పటివరకూ ఏడుస్తూనేవున్నది. పుట్టిం టికి వచ్చినతర్వాత అరవింద దుఃఖిస్తూవుండగా తండ్రికళ్ల పడటం అదే తొలిసారి. జగన్నాథం ఆదుర్దాతో అన్నాడు: "ఎందుకమ్మా ఏడుస్తున్నావు? ఇక్కడ నీకేమైనా లోటు జరి గిందా? లేక నిన్నెవరైనా యేమైనా అన్నారా? చెప్పమ్మా."

అరవింద దుఃఖాన్ని దిగమింగివేసి "నా కేలాటిలోటూ జరగలేదు నాన్నా. నాదురదృష్టానికి యెవరేమి చేస్తారు" అన్నది.

"భర్తను విడిచిపెట్టి ఏఉత్తమస్త్రీ పుట్టింట సంతోషంగా వుండగలదు" అని జగన్నాథం తన మనస్సులో సమాధాన పరుచుకొని అక్కడనుంచి ఏకాయకీ భార్యగదిలోకి వెళ్ళాడు. జగన్నాథం వెళ్లేసరికి దుర్గమ్మ తలలో అమర్చుకోవడానికి సన్నజాజుల చెండు కూరుస్తూవున్నది.

"అమ్మాయిపరిస్థితులు చూస్తే నాకు చాలా విచారంగా వున్నది. యిక్కడికి వచ్చాక ఎలా చిక్కిపోయిందో చూశా వుకదూ? అన్నీ తెలిసిన పిల్లాయె. భర్తను వదిలి యిక్కడ ఎలా సంతోషంగా వుండగలుగుతుంది? ఆమెను యిక్కడ వుంచితే యిక చేతికివచ్చేటట్టు నాకు కనుపించటం లేదు. వాళ్ళ కళ్ళనీళ్ల తుడిచేటందుకైనా ఏదో కొద్దిఆస్తి ఆమెపేర పెట్టి యిక అత్తవారింటికి పంపివేయదలుచుకున్నాను. చేసే పని నీకు చెప్పే చేద్దామని" అన్నాడు జగన్నాథం.

దుర్గమ్మ ఆమాటలకు తోకతొక్కిన తాచువలె లేచి చేతిలో పూలచెండు విసిరి నేలకు వేసికొట్టి "మీవుద్దేశాన్ని యింకా మార్చుకోలేదన్నమాట. తెల్లని కాగితంమీద అట్లా నల్లని గీత వద్దదా యీశరీరం ఏనూతిలోనో గోతిలోనో వుంటుంది. బాగా ఆలోచించుకుని మరీ చెయ్యండి" అన్నది.

ఆదెబ్బతో అతనికి ఎక్కిన తిక్క కాస్తా దిగిపోయి ముచ్చెమటలుపోసినవి.

"అట్లా అశ్లీలాలు పలకబోకు. మగనాలికి అటువంటి సాహసంమాటలు తగవు. చేతిలో పూలచెండు అట్లా నేలకు వేసి కొట్టవచ్చునా?" అంటూ జగన్నాథం నేలమీద వున్న చెండును తీసి పీటమీద వుంచి ఇక గదివెలుపలకు వచ్చి వేశాడు. "అరవింద లగ్నకాలమందే కొంత ఆస్తి ఆమెపేర వ్రాసివేసినట్లయితే ఎంత బాగుండేది?" అని తన మనస్సులో అనుకుని చేతులు నలుపుకుంటూ హాల్లోకి వచ్చి నిలబడ్డాడు. ఎదురుగా గోడకు తగిలించివున్న అతని ప్రథమభార్య మహా లక్ష్మమ్మఫొటో కనిపిస్తున్నది. ఆపటాన్ని చూసేసరికి దొంగ తనం చేసినవాడిలాగా అతని గుండెలు గబగబా కొట్టుకు న్నవి. "దుర్మార్గుడా! కొత్తపెళ్లాన్ని చేసుకుని కులుకుతూ దానిమాటలు విని నాబిడ్డను అధోగతిపాలు చెయ్యదలుచుకు న్నావా?" అని మహాలక్ష్మమ్మ తనను నిలవదీసి అడిగినట్ల యింది. జగన్నాథం యిక ఆపటంఎదట నిలబడలేక కదిలి అవతలకు వెళ్లిపొయ్యాడు.

రాత్రి పదిగంటలైంది. అరవింద అప్పటివరకూ పచ్చిగంగైనా ముట్టలేదు. ఏడ్చి ఏడ్చి ఆమెకళ్ల వాచిపోయి వున్నవి. దుర్గమ్మ అన్న మాటలు గుర్తుకువచ్చినప్పుడల్లా ఆమెకడుపులో కత్తులు మెదిలినట్లుగా వున్నది, ఇంట్లో అందరి రాత్రిభోజనాలూ అయినవి. నువ్వు తిన్నావా, తినలేదా అని పొద్దుటినుంచీ ఎవ్వరూ ఆమెను పలకరించినవాళ్లు లేరు. అత్తగారిల్లు చూస్తే అరణ్యం! పుట్టిల్లు చూస్తే ఒక అగ్ని గుండం! ఆమెజీవితప్రభాతం నిరాశామేఘాలచేత ఆవరింప బడి చిమ్మచీకట్లు కమ్మినవి. అంతా అంధకారబంధురం. ఎటు చూసినా ఆమెకు ఆశాకాంతి గోచరించటంలేదు. "అమ్మా, నన్నుగూడా నీతో తీసుకవెళ్లినట్లయితే నా కీకష్టాలు వుం డేవి కావుగదా" అని తన తల్లిని తలుచుకుని విలపించింది. చెట్టుమీది పక్షికైనా వున్నదిగాని ఆమె తలదాచుకునేటం దుకు స్థానం లేదు. ఒకప్పుడు ఆస్తి అంతటికీ అధికారిణి అనిపించుకుని ఎంతో గారాబంతో పెరిగిన అరవిందకు యీస్థితి పడుతుందని ఎవరనుకున్నారు?

గోడన వున్న గడియారం వొంటిగంట కొట్టింది. మృత్యుదేవత నేను స్థానం యిస్తాను రమ్మని అరవిందను ప్రేమతో ఆహ్వానించింది. అరవింద వెళ్లి వీధితలుపు తెరి చింది.

ఆసమయానికే పై అంతస్తులో నిద్రపోతున్న జగన్నాధం స్వప్నంలో వున్నాడు. తానూ, తన భార్యా హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూవుండగా మహాలక్ష్మమ్మ యింట్లోకి వచ్చి వాళ్ళముందు నిలబడ్డది. మహాలక్ష్మమ్మ జుట్టు విరియబోసుకుని చేతిలో శూలం పట్టుకునివున్నది. కోపంతో ఆమెకళ్లవెంట అగ్నికణాలు రాలుతున్నవి. ఆమెను చూసేసరికి జగన్నాధం భయంతో వణికిపోతున్నాడు. ఆమూర్తిని చూడగానే తల్లిచంకలో వున్న కుర్రవాడు ఖేరుమన్నాడు. దుర్గమ్మ గట్టిగా కళ్లుమూసుకున్నది. "నిన్నేమైనా చేస్తుంది. నువ్వు పిల్లవాణ్ణి తీసుకుని ఇంట్లోకి వెళ్లి తలుపువేసుకో"మని భార్యను తొందరపెట్టాడు జగన్నాధం.

"నువ్వు ఇటువంటివాడివనుకోలేదు. నాబిడ్డను నాకు పంపివెయ్యి" అని గర్జించింది మహాలక్ష్మమ్మ. అతనికి ఏమాట చెప్పేటందుకూ నోరురావడంలేదు. గడగడ వణుకుతున్నాడు. మహాలక్ష్మమ్మ ఎకాయెకీ ఇంట్లోకి వెళ్లి అరవిందను తీసుకునివెళ్లిపోతూవున్నది. జగన్నాధం తేరుకుని గద్గదకంఠంతో "నువ్వు దెయ్యానివి. అరవిందను తీసుకవెళ్ళవద్దు" అంటూ అడ్డంవెళ్లాడు. మహాలక్ష్మమ్మ పండ్లు పటపట కొరుకుతూ తన చేతిలో వున్న వాడి శూలాన్ని యెత్తింది. జగన్నాధం "అమ్మా" అంటూ నిద్రలోనుంచి త్రుళ్లిపడి లేచాడు.

అదే సమయానికి ఊరివెలపల చెరువులో నిశ్చలంగా నిద్రపోతున్న నీళ్లుగూడా శబ్దం చేసి త్రుళ్లిపడిలేచినవి,



గొప్పతనము